APTEL/26/A2020.

# ఆంధ్ర జననాడు

ANDHRA JANANADU TELUGU DAILY

తెలుగు దినపత్రిక

VOLUME :01 ISSUE:01 EDITION :ONGOLE PAGES :8 RS:01 18 MAY 2026

సంపుటి :01 సంచిక : 01 ఎడిటర్ : ఎం. ఎ. నవీన్ కుమార్ పేజీలు : 08, వెల. 1రూ/ సోమవారం-18 - మే - 2026

ఆంధ్ర జననాడు

ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా, మండలాల వారిగా విలేఖర్లుగా పని చేయడానికి అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు

సంప్రదించండి

89195 17176

## తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక



మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు

45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం

ఉదయం 10:30 నుంచి సాయంత్రం

4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన

వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు,

రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

అమరావతి : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. మిగతా..2లో

## సర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నాయి..



సర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క దగ్గర మాత్రమే ఉండాలని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్, మే 17 : సర్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క దగ్గర మాత్రమే ఉండాలని చెప్పుకొచ్చారు. ప్రింటింగ్ ఎర్రర్ కారణంగా ఒక్కొక్కరి ఓటు పది ప్రాంతాల్లో చూపిస్తోందని తెలిపారు. ఈరోజు (ఆదివారం) హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో సర్ షెడ్యూల్ వచ్చిందని ప్రస్తావించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని తాము తప్పుపట్టడం లేదని అన్నారు. ఓటర్ లిస్టు సరిదిద్దడంలో అందరి బాధ్యత ఉందని తెలిపారు. మిగతా..2లో

## వితంతువులకు శుభవార్త.. ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు



- ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు
- కీలక నిర్ణయం తీసుకున్న చంద్రబాబు సర్కారు
- వితంతువులకు కొత్తగా పెన్షన్లు
- త్వరలోనే ఆన్ లైన్ లో పేర్లు నమోదుకు అవకాశం

అమరావతి: రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో

## నిర్మాణ దశలోనే అమరావతి

# అందరి దృష్టిని ఆకర్షిస్తోంది‘

### స్ఫూర్తిదాయక గాథలను పంచుకున్న లోకేశ్

- అమరావతి క్వాంటం వ్యాలీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందన్న లోకేశ్
- ఎక్స్ వేదికగా స్ఫూర్తిదాయక గాథలను పంచుకున్న మంత్రి
- క్వాంటం నిర్మాణంలో యువత కృషి అభినందనీయమని కితాబు



అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణ దశలోనే, భవిష్యత్తు కోసం కలలు కనే నూతన సృష్టికర్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు తదితరులను ఆకర్షిస్తోందని ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అమరావతిపై ఉన్న నమ్మకానికి, మన ప్రతిష్టాత్మక లక్ష్యాలకు, ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక శక్తివంతమైన సందేశమని మంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతి వేదికగా సాకారం అవుతున్న కొన్ని స్ఫూర్తిదాయక గాథలను మంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. గుంటూరుకు చెందిన పల్లవి కాయల ఒక సామాన్య రిక్షా కార్మికుడి కుమార్తె అని గుర్తు చేశారు. పదో తరగతిలో 600కి 600 మార్కులు సాధించిన ఆమె, ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ (ఐఐఐటీ)లో శిక్షణ పొందిన ప్రతిభావంతమైన ఇంజనీర్ అని వివరించారు. మిగతా..2లో

## అమరావతిలో క్వాంటం సెక్యూర్ టెస్ట్ బెడ్.. దేశంలోనే తొలిసారి



- ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా పరిశోధనలు
- సైబర్ రక్షణ పరిష్కారాలకు కేంద్రంగా అమరావతి
- మేకిన్ ఇండియా సాంకేతికతలకు ఈ ప్రాజెక్టుతో ఊతం

అమరావతి : దేశంలోనే తొలి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ అమరావతిలో ఏర్పాటు కానుంది. ఈ సరికొత్త ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ఆయన ‘ఎక్స్’ వేదికగా ఈ విషయాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సి-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఈ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్లకు అమరావతి ఇకపై కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

## 11శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు

# ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్

- నెదర్లాండ్స్ నుంచి భారత్ కు విజయవంతంగా తిరిగి రానున్న చోళ రాగి ఫలకాలు
- “ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం!



ఢిల్లీ : భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక ‘చోళ రాగి ఫలకాలను‘ నెదర్లాండ్స్ నుంచి భారత్ కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్-నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది. మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. “ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. మిగతా..2లో

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!

### ప్రమాణ స్వీకారానికి ముందే ప్రకటించిన సతీశన్



- కేరళలో సోమవారం కొలువుదీరనున్న యూడీఎఫ్ ప్రభుత్వం
- సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న వీడీ సతీశన్
- హాజరుకానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, ఇతర సీనియర్ నేతలు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశం

## యుద్ధ నష్టపరిహారం

# ఇవ్వబోమని స్పష్టం

### 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్

- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు
- పరహారం ఇవ్వాల్సిందేనని పట్టు



ఢిల్లీ : ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. మిగతా..2లో

## బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదు



- పోక్సో కేసులో బండి భగీరథ్ అరెస్ట్
- ఇప్పటికే సరెండర్ అయ్యాడన్న కిషన్ రెడ్డి
- ఇక చర్చించాల్సిన అవసరం లేదని వెల్లడి
- రాష్ట్ర పోలీసులే చూసుకుంటారని స్పష్టీకరణ

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పందించారు. భగీరథ్ ఇప్పటికే సరెండర్ అయ్యాడని గుర్తుచేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

### ప్రతిపైసా కేంద్రానిదే

## రానున్న 5 రోజులు

# నిప్పుల కొలిమే

- రానున్న ఐదు రోజులు రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న ఐఎండీ
- అధిక ఎండలతో పాటు, వడగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు రెడ్ , ఆరెంజ్ అలర్ట్ జారీ



హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. కాగా రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అధిక ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్ , కుమురం భీం ఆసిఫాబాద్ , జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ 16 జిల్లాల్లో 41 నుంచి 44 మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా..2లో

## బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం



- పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్
- ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు
- నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ
- బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్

హైదరాబాద్ : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన ‘నా బూత్- నా భవిష్యత్తు’ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక

ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

## వితంతువులకు శుభవార్త..
## ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## అమరావతిలో క్వాంటం
## సెక్యూర్ టెస్ట్ బెడ్.. దేశంలోనే తొలిసారి

సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశ భవిష్యత్తుకు ఎంతో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభమైనప్పటి నుంచి ఏపీలో కీలక అడుగులు పడుతున్నాయి. టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం రంగాల్లో అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త టెస్ట్ బెడ్ క్వాంటం కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడనుంది. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా టెక్నాలజీలకు ఊతం లభించడంతో పాటు అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కుతుంది. డీప్-టెక్ ఆవిష్కరణలకు ఏపీ రాజధాని కీలక కేంద్రంగా మారబోతోంది. ప్రపంచ భవిష్యత్తును మార్చే సాంకేతికతలను రూపొందించడంలో ఏపీ విద్యార్థులు, స్టార్టప్‌లు భాగస్వాములు కావడానికి ఇది మంచి అవకాశమని చంద్రబాబు అన్నారు. ఈ అద్భుతమైన ప్రాజెక్టు కోసం శ్రమిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం

విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## రానున్న 5 రోజులు నిప్పుల కొలిమే
### ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో నెలకొన్న గాలి విచ్ఛిన్నతితో రాష్ట్రంలో ఇవాళ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు వడగాలుల ప్రభావంతో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశంతో ఆదిలాబాద్ , కుమురం భీం ఆసిఫాబాద్ , నిర్మల్, నిజామాబాద్ , జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్ ను జారీ చేశారు. రాష్ట్రంలో సోమవారం 41 నుంచి 44 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ మేరకు కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ , మేడ్చల్-మాల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ , నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను జారీ చేసింది.

## బండి సంజయ్ కేంద్ర మంత్రి
## పదవిలో కొనసాగడం దేశానికే అవమానం

కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

## బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదు

మరోవైపు ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపైసా కేంద్రమే ఇస్తోందని వెల్లడించారు. అయినా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు రాష్ట్రం బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని.. వారికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

## పీఆర్సీ - డీఏ విలీనం.. ఉద్యోగులకు నష్టమే!

క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ ఆశయాలను అమలు చేస్తూ, పగలు రేయి శ్రమిస్తున్న ఉద్యోగులు ఈ పరిపాలనా యంత్రాంగానికి వెన్నెముక వంటివారు. ఉద్యోగుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలను కేవలం ఆర్థిక భారంగా చూడటం అంటే, అది ఒక వర్గానికి చేసే అన్యాయం మాత్రమే కాదు, మొత్తం పరిపాలనా వ్యవస్థనే నిర్వీర్యం చేయడమే అవుతుంది. ప్రస్తుతం తెలంగాణలో చర్చనీయాంశంగా మారిన 2వ పీఆర్సీ , డీఏ (ణూా) విలీన ప్రక్రియపై శాస్త్రీయ విశ్లేషణ అవసరం.

డీఏ విలీనం ఒక ఆర్థిక వ్యూహం?

తెలంగాణలో 2వ పీఆర్సీ అమలు తేదీ జులై 1, 2023. నిబంధనల ప్రకారం ఆ తేదీ నాటికి ఉన్న 33.67% డీఏను మాత్రమే బేసిక్ పేలో విలీనం చేయాలి. కానీ, ప్రభుత్వం రాబోయే 5 పెండింగ్ డీఏలను (సుమారు 12.74%) కూడా కలిపి మొత్తం 46.41% డీఏను బేసిక్ పేలో విలీనం చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పైకి జీతం పెరిగినట్లు కనిపించినా, లోతుగా పరిశీలిస్తే ఉద్యోగులకు శాపంగా మారే ప్రమాదం ఉంది. ఇలా పెండింగ్ డీఏలను విలీనం చేయడం వల్ల ఉద్యోగికి రావాల్సిన భారీ 'బకాయిలు' నగదు రూపంలో అందవు. దీనివల్ల ఉద్యోగి తక్షణ ఆర్థిక వెసులుబాటును కోల్పోతాడు. అంతేకాకుండా, పీఆర్సీ అమలు తేదీ తర్వాత వచ్చే డీఏలను ముందే విలీనం చేయడం సర్వీస్ రూల్స్‌కు విరుద్ధం.

బేస్ ఇయర్ - గణాంకాల మాయాజాలం

ద్రవ్యోల్బణాన్ని, నిత్యావసర ధరల పెరుగుదలను కొలిచే ప్రాతి పదిక 'బేస్ ఇయర్'. కేంద్రం ఇప్పటికే 2016ను ప్రాతిపదికగా తీసుకుని వేతన సవరణలు చేస్తోంది. కానీ మన రాష్ట్రంలో ఇంకా పాత 2001 బేస్ ఇయర్‌ను ప్రామాణికంగా తీసుకుంటే ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుంది. 2001 నాటి లెక్కల్లో కేవలం ఆహార పదార్థాలకే ఎక్కువ వెయిటేజీ ఉంది. కానీ నేటి ఆధునిక జీవనంలో విద్య, వైద్యం, రవాణా ఖర్చులు 30% పైగా పెరిగాయి. పాత బేస్ ఇయర్‌ను వాడటం అంటే, పెరిగిన ఈ ఆధునిక ఖర్చులను ప్రభుత్వం లెక్కలోకి తీసుకోనట్లే. ఫలితంగా ప్రకటించే 'ఫిట్మెంట్' ఎంత ఉన్నా, వాస్తవ 'కొనుగోలు శక్తి' పెరగదు.

కింగ్ ఫ్యాక్టర్, రిటైర్మెంట్ ప్రయోజనాలు..

విలీన ప్రక్రియలో 'లింకింగ్ ఫ్యాక్టర్'ను (ప్రస్తుతం 2.88) శాస్త్రీయంగా నిర్ణయించకపోతే, కొత్త వేతన స్కేళ్లలో ఉద్యోగి పొందే 'రియల్ వేతనం' ప్రస్తుత ధరల కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం కేవలం నెలవారీ జీతంపైనే కాదు, రిటైర్మెంట్ ప్రయోజనాలపై తీవ్రంగా ఉంటుంది. గ్రాట్యుటీ, కమ్యుటేషన్, పెన్షన్ లెక్కలు అన్నీ మూల వేతనం పైనే ఆధారపడి ఉంటాయి. బేసిక్ పే పెరుగుదల శాస్త్రీయంగా లేకపోతే, పదవీ విరమణ సమయంలో వచ్చే లక్షలాది రూపాయల ప్రయోజనాలు ఆవిరైపోతాయి.

# 'నిర్మాణ దశలోనే అమరావతి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది'

మొదటి పేజి తరువాయి

అలాగే, క్వాంటం ఆపరేషన్స్‌పై పనిచేసేందుకు గోపాల్ జోషి ముంబై నగరాన్ని వదిలి ఇక్కడికి మారారన్నారు. దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థలలో కొన్నేళ్లపాటు రీసెర్చ్ చేసిన నాగ లక్ష్మయ్య ఇప్పుడు అమరావతిలోనే అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ వ్యవస్థలను నిర్మిస్తున్నారని మంత్రి లోకేశ్ వివరించారు. యువత కృషి అభినందనీయం : వీరంతా కేవలం మీడియాలో కనిపించేపేర్లు మాత్రమే కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను నమ్మి, భవిష్యత్తు తరాల కోసం ఇక్కడే శ్రమిస్తున్న అసాధారణ మేధావులని లోకేశ్ కొనియాడారు. అమరావతిలో భారతదేశ క్వాంటం భవిష్యత్తును నిర్మించడంలో భాగస్వాములు అవుతున్న ఈ యువ భారతీయుల కృషి నిజంగా అభినందనీయమని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వారిని ప్రశంసించారు. భారతదేశంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న డీప్-టెక్ హబ్‌కు అమరావతి క్వాంటం వ్యాలీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. క్వాంటమ్ విప్లవం




దిశగా ఏపీ: మరోవైపు భారతదేశం క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే దిశగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది. క్వాంటం వ్యాలీకి ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావటంలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి సంస్థలు కీలకంగా వ్యవహరించాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన చేయనున్నారు. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబర్ కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. క్వాంటం భవనానికి శంకుస్థాపనతో దేశ భవిష్యత్ సాంకేతికతకు అమరావతిలో పునాది వేశామని మంత్రి లోకేశ్ అన్నారు. హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ప్రపంచ పటంలో నిలబెట్టిన విజనరీ చంద్రబాబు ఇప్పుడు అమరావతిని తదుపరి సాంకేతికత కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. వినూత్న ఆవిష్కరణల కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఎంతో కీలకం కానుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే 50 వేల మందికి పైగా యువత క్వాంటం కంప్యూటింగ్ శిక్షణ పొందారని వివరించారు. మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగా అమరావతి క్వాంటం కేంద్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## 11శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు
# ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్

మొదటి పేజి తరువాయి

ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్ 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు పశ్చిమాసియాలో పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్లోబల్ ఎనర్జీ సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు ఆటంకాల వల్ల ఈ ప్రాంతం సహా ప్రపంచంపై పడే తీవ్ర ప్రభావాలపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం కొనసాగాలని మోదీ, జెట్టెన్ పిలుపునిచ్చారు. ఎలాంటి నియంత్రణ చర్యలనైనా వ్యతిరేకించాలని, ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు తమ మద్దతును కొనసాగించాలని



ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితి, రష్యాతో కొనసాగుతున్న ఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో కలిసి ఆదివారం అఫ్స్లాయిట్‌డైక్ డ్యామ్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

# సర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నాయి..

మొదటి పేజి తరువాయి

ఒక్కో పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళ్తారని చెప్పారు.

### ఉద్యోగులపై నమ్మకం లేదు..

రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మకం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ముస్లింల మీటింగ్‌కి వెళ్లి.. మీరంతా ముందుకు రావాలని సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సర్ చేసేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని.. బీజేపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. సర్‌లో కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతుందో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నాయని ఆగ్రహించారు. కేరళం, తమిళనాడులో బీజేపీ గెలవలేదు కాబట్టి అక్కడ సర్ బాగా జరిగిందని అంటున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ గెలిచింది కాబట్టి అక్కడ సర్ తప్పు జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

### పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి..

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని...



ఎలక్షన్ కమిషన్‌పై బురద జల్లవద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. సర్ కాంగ్రెస్ హయాంలో కూడా జరిగిందని ప్రస్తావించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు ఉంటే... ఒక్కొక్కరిని వెతికి తొలగించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. విదేశీయులను తొలగిస్తే రాహుల్‌గాంధీకి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో సర్ జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది ఉందని.. కేంద్ర సిబ్బంది కాదని తేల్చిచెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్థాయికి తాను దిగజారనని అన్నారు. బీఆర్ఎస్ మీద కాంగ్రెస్ దొంగ ఓట్లతో గెలిచిందా..? అని ప్రశ్నించారు మాజీమంత్రి కేటీఆర్ రెండుసార్లు గెలిచి మంత్రి అయితే అప్పుడు ఎలక్ట్రానిక్ మిషన్ మంచిదా..? అని నిలదీశారు. ప్రజలు చాలా తెలివైనవాళ్లని చెప్పారు. సర్‌నీ రాహుల్‌గాంధీ వ్యతిరేకించిన.. తెలంగాణలో వాళ్లే పూర్తి చేస్తారని తెలిపారు.

### రైతులను కాంగ్రెస్ మోసం చేస్తోంది..

రెండున్నరేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల విషయంలో ఎక్కడ వేసినా గొంగళి అక్కడే ఉందని విమర్శించారు. రైతులకు అరకొర రుణమాఫీ.. లక్షలాది మంది రైతులు బ్యాంకుల దృష్టిలో డిఫాల్టర్స్ అయ్యారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోలులో కేంద్రం అండగా ఉన్న... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందుతోందని ప్రశ్నించారు. మీగాని కేంద్రం పెంచిన.. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎందుకు ఇబ్బంది పడుతుందో అర్థం కాని పరిస్థితి ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎదురు దాడిపై దృష్టి పెడుతున్నారు తప్ప.. ఎందుకు ఆయా పంటలు కొనుగోలు చేయడం లేదో చెప్పట్లేదని ప్రశ్నించారు.

### సన్నవడ్లకు బోనస్ ఏది..?

రూ.500 బోనస్ ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద ప్రకటనలు చేశారని కిషన్‌రెడ్డి అన్నారు. సన్నవడ్లకు కూడా బోనస్ పూర్తిగా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ధాన్యం కొనుగోలులో ప్రతి పైసా కేంద్రం ఇస్తోందని స్పష్టం చేశారు. అన్నదాతకు కావాల్సిన ప్రతి వస్తువును కేంద్రప్రభుత్వమే ఇస్తోందని తేల్చిచెప్పారు. అనేక విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. వాళ్ల చేతకానీ తనం.. వాళ్ల వైఫల్యం ఇతరుల మీద రుద్ది.. వాళ్లు హీరోలం అవుదామని అనుకుంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!- ప్రమాణ స్వీకారానికి ముందే ప్రకటించిన సతీశన్

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : కేరళలో సోమవారం వీడీ సతీశన్ సారథ్యంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్-యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగంసిద్ధమైంది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయూఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. అయితే, భాగస్వామ్యపక్షాలతో ఇవాళ జరిగిన చర్చల్లో కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు కానున్న ముఖ్యమంత్రి సతీశన్ తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితలా, మురళీధరన్, సన్నీ జోసెఫ్‌లు కేబినెట్‌లో చేరనున్నట్లు చెప్పారు. యూడీఎఫ్ లో కీలక భాగస్వామి అయిన ఐయూఎంఎల్ కు 5 పోర్టుపోలియోలు దక్కాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సాదిక్ అలీ, వీడీ సతీశన్ కేబినెట్‌లో చేరనున్న ఐదుగురి పేర్లను ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని కూడా యూడీఎఫ్ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు హాజరుకానున్నారు. వీరితో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉంది.




# అక్షరాలా దేశద్రోహమిది!

'సోకోర్చువాడె మనుజుడు' అన్నాడు సుమతీ శతకకర్త. అంటే- కష్టాలను, దుఃఖాన్ని భరించేవాడే మనిషి అని అర్థం. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి ఈ మాట మరో రకంగా అర్థమైనట్లుంది. అందుకే పనిగట్టుకుని మరి విద్యార్థులను ఏడిపించడం కాదు... కాల్చుకుతింటోంది. మంచి భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు తిండీతిప్పలూ మాని పుస్తకాలతో కుస్తీపట్టే పిల్లలను అది రాచిరంపాన పెడుతోంది. పైపెచ్చు ఒకటీ అరా సందర్భాలతో సరిపెడితే అసమర్థ సంస్థగా తాను తగిలించుకున్న తగరపు కిరీటం ఊడిపోతుందన్న భయంతో కాబోలు... మళ్లీమళ్లీ తన అధ్వాన పనితీరుతో దేశవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది. పనిమంతుడు పందిరి వేస్తే కుక్కతోక తగిలి కూలిపోయిన చందంగా ఎన్‌టీఏ పనితీరు అఘోరించబట్టే ప్రశ్నపత్రం లీకేజీతో 'నీట్' యూజీ పరీక్ష రద్దయ్యింది. పిల్లల ఉసురుపోసుకోవడంలో ఎన్‌టీఏ దారుణ దుష్కీర్తి మరోసారి జగత్‌విఖ్యాతమైంది. దయార్ద్రహృదయుల పేరు చెబితే మనకు రంతిదేవుడు, శిబి, బలి చక్రవర్తి లాంటివారు గుర్తొస్తారు. అయితే, ఎన్‌టీఏ విశాలహృదయం ముందు వారంతా దిగదుడుపే. వ్యవస్థకు వేరుపురుగుల వంటివారిని కరుణించి అక్కున చేర్చుకోవడంలో ఎన్‌టీఏ ముందూవెనకా చూడట్లేదు కాబట్టే 'నీట్' ప్రశ్నపత్రం రూపొందించిన నిపుణుల కమిటీ సభ్యుడే దాన్ని లీక్ చేయగలిగాడు. అంతేనా.. సొంతింట్లో కోచింగ్ క్లాసులూ పెట్టాడు. ఎక్కడెక్కడి వారినందరినీ పోగేసి ఫలానా ప్రశ్నలు వస్తాయి.. బాగా బట్టీపట్టండి అంటూ బేరసారాలకు తెరతీశాడు. సీబీఐ దర్యాప్తు మొదలయ్యే వరకూ ఇదంతా ఎన్‌టీఏ దృష్టికి రాలేదంటే ఎవరు ఎక్కడ గుడ్డిగుర్రాలకు పళ్లు తోముతున్నట్లు? లక్షల మంది పోటీపడే ప్రతిష్ఠాత్మక ప్రవేశపరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం తయారు చేసేవారు డబ్బుకు కక్కుర్తిపడి దారితప్పితే పరిస్థితి ఏంటని ఎన్‌టీఏ వర్గాలు ఆలోచించలేకపోయాయా? నిపుణుల కమిటీ ఎంపికలో ఆమాత్రం జాగ్రత్తలు తీసుకోలేకపోయాయా? ప్రశ్నపత్రం రూపకర్తలు బయట ఏంచేస్తున్నారో కాస్త కనిపెట్టుకుని ఉండటం ఏమైనా కష్టమైన పనా? ఆ దారితప్పిన ప్రొఫెసర్ అంత దర్జాగా కోచింగ్ సెంటర్ తెరిచాడంటే, తనను ఎవరూ పట్టుకోలేరన్న ధీమా అతగాడిలో ఎగదన్నిందంటే ఎవరు కారణం? చేవచచ్చిన వ్యవస్థది కాదా ఆ తప్పు? 1996లో ఉమ్మడి ఏపీలో ఎంసెట్ ప్రశ్నపత్రం లీక్ కావడానికి స్వయంగా అప్పటి కన్వీనరే పుణ్యం కట్టుకున్నాడు. కంచే చేను మేసినట్లుగా బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్న వ్యక్తులే వ్యవస్థను కుళ్లబొడవడం క్షమించరాని నేరం! అక్షరాలా ఇది దేశద్రోహం! 'నీట్' పేపర్‌ను లీక్ చేసి, పరీక్ష రద్దుకు కారణమైన వ్యక్తులు కటకటాల్లో తప్ప బయట ఉండటానికి తగరు. ఒకరిని హత్యచేసిన వ్యక్తే ఉరిశిక్షకు అర్హుడైనప్పుడు నవతరం ఆశలను కాలరాసి జాతి భవితను బలిపీఠంపైకి చేర్చుతున్న ఇలాంటి నేరగాళ్లకు ఎందుకు అంతటి కఠిన దండన విధించకూడదు? 'నీట్'లో ఒక్కో ప్రశ్నకు జవాబు రాయడానికి సగటున ఒక నిమిషం సమయం మాత్రమే దొరుకుతుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మైనస్ మార్కు పడుతుంది. ఇంతటి కఠినమైన పరీక్షలో కాలంతో పోటీపడుతూ మెరుగైన స్కోరు రాబట్టేందుకు విద్యార్థులు ఎంత ఒత్తిడికి లోనవుతారు!? మూడు గంటల్లో తమ తలరాతను మార్చే పరీక్షలో గెలిచేందుకు వారెన్ని నిద్రలేని రాత్రులు గడిపి ఉంటారు!? కోచింగ్‌లకు ఎంతెంత ధారపోసి ఉంటారు!? కానీ, ఎన్‌టీఏ బాధ్యతారాహిత్యంతో వారి కష్టమంతా ఇప్పుడు ఏట్లో పిసికిన చింతపండు చందమైంది. ప్రక్రియ మొత్తం మళ్లీ మొదటికొచ్చింది. ఎలాంటి లోపాలకు తావులేకుండా పరీక్ష నిర్వహించేందుకంటూ 'నీట్' కేంద్రాల దగ్గర ఎన్‌టీఏ చాలా హడావుడి చేస్తుంటుంది. అభ్యర్థుల పక్కపిన్నులు, ఆభరణాలు మొదలు చివరికి దుస్తుల గుండీలనూ తొలగిస్తూ నానా హంగామా సృష్టిస్తుంటుంది. ఇలా చీమలు దూరకుండా ముందువైపు కాపలా కాస్తుంటే, వెనక నుంచి ఏనుగులు చొరబడినట్లు... దొడ్డిదారిన పేపర్లు కొట్టేసేవాళ్లను ఎన్‌టీఏ కట్టడి చేయకపోబట్టే 23 లక్షల మంది విద్యార్థుల కుటుంబాలు ఇప్పుడు గుండెమంటతో రగిలిపోతున్నాయి. 'నీట్' ఆలస్యంతో ఇతర కౌన్సెలింగ్‌లలోనూ జాప్యం అనివార్యమవుతోంది. పైగా మరోసారి పరీక్షకు సిద్ధమయ్యేందుకు పిల్లలపై ఆర్థికంగా, మానసికంగా కొండంత భారం మళ్లీ పడుతుంది. 'నీట్' నిర్వహణలో రవ్వంత నిర్లక్ష్యం కనపడినా కఠినంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు గతంలో స్పష్టంగా చెప్పింది. మరి ఇంతటి గందరగోళానికి కారణమైన ఎన్‌టీఏ బాధ్యులు దీనికి జవాబుదారీ వహిస్తారా? యథాలాపంగా చేతులు దులుపుకొనిపోతారా? అతిప్రేమతో గారాబం చేస్తే పిల్లల బుద్ధి చెడిపోతుంది. వారు సమాజానికి పనికిరాని సోమరులుగా తయారవుతారు. కష్టపడి పనిచేయడం తెలియని వాళ్లు చిన్న ఇబ్బంది తలెత్తగానే కుంగిపోతారు. జీవితంలో ఎదగలేక, పోటీలో నెగ్గుకురాలేక చివరికి తమకు తామే భారమౌతారు. ఈ విషయం తెలిసీ చాలామంది తల్లిదండ్రులు పిల్లల బతుకుల్ని చేజేతులా నాశనం చేస్తున్నారు. రాజస్థాన్‌లో ఒక కుటుంబం గతంలో, ఈసారి తమ పిల్లల కోసం 'నీట్' ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసినట్లు సీబీఐ చెబుతోంది. తగిన సామర్థ్యం లేకున్నా ఇలా అనైతిక మార్గంలో డాక్టర్లు అయినవాళ్లు జనానికి సరైన వైద్యమేమి చేస్తారు? ఇలాంటి కుటుంబ పెద్దలే సమాజానికి నిజమైన ప్రమాదకారులు! దొంగ దారుల్లోనైనా సరే,

# సంపాదకీయం

## ఆ స్వాతంత్ర్య యోధులు బానిసలయ్యారు!

ఆధునిక ప్రపంచంలో అతిపెద్ద ఒప్పంద కార్మిక వలసలు భారతదేశం నుంచే జరిగాయి. 18701930 మధ్య కాలంలో విదేశాలకు వలస వెళ్లిన భారతీయుల సగటు వార్షిక సంఖ్య 2,40,000 నుండి 6,60,000 మధ్య ఉన్నది. కేవలం 191115 సంవత్సరాల మధ్య మొత్తం 24,83,000 మంది వలస వెళ్లారు. ఒప్పంద వ్యవస్థలోని ఈ భారతీయుల ఇతిహాసం మానవ అక్రమ రవాణాల చరిత్రే. 1833లో బానిసత్వం రద్దయిన తరువాత, తోట యజమానులు అయిన బ్రిటిష్ వ్యాపారులు భారీ ఆర్థిక నష్టాలు చవిచూశారు. ఒకవైపు భారతీయులు స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలు త్యాగం చేస్తున్న ఆ సమయంలోనే, బానిసత్వ నష్టాన్ని భర్తీచేసుకోవడానికి అన్ని 'కులాల' భారతీయులను కార్మిక కూలీలుగా మార్చేందుకు బ్రిటిష్ వ్యాపారులు, అధికారులు కలసికట్టుగా కుట్ర పన్నారు. అప్పటి నిరాశాజనక పరిస్థితులను ఆసరాగా చేసుకొని, ఒప్పంద కార్మికుల నియామక వ్యవస్థ పేరున, వలసవాద మోసాలతో, దాదాపు 13 లక్షల మంది భారతీయులను ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు కూలీల ముద్రవేసి పంపగలిగారు. 1857లో ఈస్టిండియా కంపెనీ పాలనపై దాని సొంత (భారత) సైనికులే తిరుగుబాటు చేశారు. ఆ ఘటన భారతదేశ చరిత్రలో అత్యంత వీరోచిత గాథలలో ఒకటి. సిపాయిల తిరుగుబాటుగా, మొదటి భారత స్వాతంత్ర్య సమరంగా దానిని భావిస్తారు. ఈస్టిండియా కంపెనీ ఓటమిని జీర్ణించులోలేక, బ్రిటిష్ ప్రభుత్వం నేరుగా భారతదేశ పాలనను తన అధీనంలోకి తీసుకున్నది. విక్టోరియా రాణి భారతదేశ సామ్రాజ్ఞి అయింది. సిపాయి తిరుగుబాటులో పాల్గొన్న వందలాది సైనికులకు విధించిన శిక్షలలో ఒకటి వారిని ఒప్పంద కార్మికులుగా విదేశాలకు పంపడం! అందులో భాగంగా 1000 మందిని వారి కుటుంబాలతో సహా బెలిజ్‌కు బహిష్కరించారు.తమకు కనీసం 70,000 మంది కావాలని ట్రినిడాడ్‌లోని తోటల యజమానులే అడిగినట్లు బ్రిటిష్ రికార్డులు చెబుతున్నాయి. దాస్య శృంఖలాల నుంచి మాతృభూమి విముక్తికి పోరాడిన వీర యోధులకు బ్రిటిష్ విధించిన శిక్షే ఒప్పంద కార్మిక బానిసత్వం. భారత స్వాతంత్ర్య సమరయోధులు వలసపాలకుల దృష్టిలో రాజద్రోహులయ్యారు. వేల మైళ్ల దూరాన ఉన్న దేశాలకు కుటుంబాలతో సహా బహిష్కృతులయ్యారు. బానిస శ్రామికుల కొరతను భర్తీ చేసేందుకు వారిని ఉపయోగించుకున్నారు. 185862 మధ్య కాలంలో మారిషస్, గయానా, ట్రినిడాడ్, గ్రెనడా, సెయింట్ లూసియా, జమైకాకు ఇలా పంపబడిన వారి సంఖ్య 1,57,719 అని వలసలపై నివేదిక ఒకటి పేర్కొంది. మారిషస్‌కు 'వలస' వెళ్ళిన 90,000 మందిలో అత్యధికులు సైనికులే అని ఆ నివేదిక గుర్తించింది. '...సైనిక శిక్షణకు అర్హతలు కలిగి ఉన్న ఒప్పంద కార్మికుల్లో దాదాపు 25 లేదా 30 మంది బహుశా తిరుగుబాటు దళానికి చెందినవారు కావచ్చు' అని వెస్టిండీస్ మైగ్రేషన్ ఏజెంట్ తెలిపాడు. ఈ వాస్తవాన్ని '...వారు అతి జాగ్రత్తగా దాచిపెట్టారు' అని అతడు పేర్కొన్నాడు. నిజానికి, స్వాతంత్ర్య సమరయోధులలో చాలామంది హింస, జైలు శిక్షల ఉచ్చు నుండి తప్పించుకోవడానికి కార్మికులుగా వలసరాజ్యాలకు మారువేషంలో కూడా వెళ్లారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినందుకు, గతంలో దేశద్రోహం కేసులో జైలులో పెట్టబడిన వారు కూడా చాలా మంది అందులో ఉన్నారు. 'ఉన్నత కుల' భారతీయ సైనికులు, తోటలలో మారువేషంలో ఉండే అవకాశం ఉందని, అందువల్ల కలకత్తాలోని ఏజెంట్‌కు '...బ్రాహ్మణులు, ఠాకూర్లు, ఫకీర్లు, ఇతర శ్రామికేతర కులాల వారు కాలనీకి బయలుదేరకుండా నిరోధించమని' గయానాలోని తోటల యజమానుల నుంచి అనేక సూచనలు జారీఅయ్యాయి. తోటి భారతీయులను సమ్మెకు ప్రేరేపించారనే అనుమానంతో చాలా మంది పండితులు లేదా బ్రాహ్మణులను కూడా గయానా నుంచి బహిష్కరించారు. వారెవరూ ఆయుధాలు ధరించి ఉండేవారు కాదు. భారతీయ జనాభాను సామూహిక తిరుగుబాటుకు ప్రేరేపించే ప్రమాదం ఉందన్న గ్రహింపుతో, అలాంటి బ్రాహ్మణులను వారున్న ప్రాంతంలో హతమార్చలేదు. ఫిజీలో చాలా మంది భారతీయులను ఇతర తోటలకు తీసుకెళ్లే నెపంతో చిన్న పడవలలో రవాణా చేస్తూ పడవలు పడవలనే ముంచేశారు! బ్రిటిష్ వారు దాచిపెట్టిన సామూహిక హత్యాకాండలివి. ఉత్తర భారతావనిలో సైనికుడు లేదా యోధుడికి సిపాయి లేదా సిపాహి అన్న పేరు ఉంది. ట్రినిడాడ్‌లోని భారతీయ సమాజం చాలా కాలంగా కాళీమాతని సిపాయిల/సిపాహీల తల్లి అని పిలుచుకుంటూనే ఉన్నారు. ముదురు నలుపు రంగులో ఆమె ప్రతిమలను తయారు చేసుకున్నారు. హిందూ మతంలో ముఖ్యంగా సైనికులకు లేదా సిపాహీలకు యుద్ధ దేవతగా ఆమె పూజ్యురాలు. ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాలలో సైనికులు కాళీమాతను పూజించే ఆలయం ఉండేది. 1947 వరకు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాట యోచనలు చేసే కేంద్రాలుగా కూడా అవి మనుగడలో ఉన్నాయి. వాస్తవానికి, భారతీయ విప్లవకారులు అప్పట్లో కాళీమాత ఆశీర్వాదం కోరేవారు. సుభాష్ చంద్రబోస్ సైతం రహస్యంగా కలకత్తాను విడిచిపెట్టే ముందు దక్షిణేశ్వర్ ఆలయం నుండి కాళీమాత ఆశీర్వాదం పొందారు. ఈ ఆచారం చాలా కాలం ముందే ప్రారంభమైంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 18వ శతాబ్దిలో సాదువులు, ఫకీర్లు కలసికట్టుగా దాదాపు 30 సంవత్సరాలు పోరాడారు. 'సన్యాసి తిరుగుబాటు'గా సుప్రసిద్ధమైన ఆ పోరాటంలో ఎంతో మంది సాధువులు, ఫకీర్లు హతమయ్యారు. ఆ చరిత్రాత్మక తిరుగుబాటులోనే 'వందేమాతరం' ఒక యుద్ధ నినాదంగా మారింది. 857 తిరుగుబాటు కాలంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారితో పాటు పోరాడిన సామాన్య ప్రజల మీద బ్రిటిష్ వారు క్రూరంగా ప్రతీకారం తీర్చుకున్న గ్రామాల సంఖ్యను ఎవరూ లెక్కించలేరు.

# అమ్ములపొదిలో దివ్యాస్త్రం



'మిషన్ దివ్యాస్త్ర' పేరిట అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించడం వ్యూహాత్మక ఆయుధ కార్యక్రమంలో కీలక మైలురాయిగా నిలుస్తోంది. నేల నుంచి నింగికి ఎగిరి, అక్కడి నుంచి మళ్లీ భూవాతావరణంలోకి ప్రవేశించి... ఏకకాలంలో అనేక శత్రు లక్ష్యాలపై బహుళ క్షిపణులను ప్రయోగించగల సామర్థ్యం(ఎంఐఆర్‌వీ) అగ్ని-5 సొంతం. శత్రువుపై దాడికీ, శత్రుదాడులను నిరోధించే సత్తాను సంతరించుకోవడానికీ భారత్ దీక్షగా చేస్తున్న కృషిని 'మిషన్ దివ్యాస్త్ర' ప్రతిబింబిస్తోంది. క్షిపణి రక్షణ వ్యవస్థలు, శత్రు స్థావరాలను గురితప్పకుండా కొట్టే సామర్థ్యాలు, నిఘా నెట్‌వర్క్‌లు, విస్తరిస్తున్న అణ్వస్త్రాలు అంతర్జాతీయ భద్రతా వాతావరణాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. ఇటీవలి యుద్ధాల్లో సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలను విస్తృతంగా ప్రయోగిస్తున్నారు. శత్రు సైన్యాలకు ఆయుధాలు, ఆహారం, ఇతర వస్తువులను రవాణా చేసే సదుపాయాలపైనా... కమ్యూనికేషన్ యంత్రాంగాలు, ఇంధన కేంద్రాలు, వైమానిక స్థావరాలు, కమాండ్ సెంటర్లపైనా క్షిపణులు విరుచుకుపడుతున్నాయి. ఇటువంటి వాతావరణంలో ప్రత్యర్థుల దెబ్బను కాచుకుని శీఘ్రంగా ఎదురుదాడి చేయగలగాలి. తాను శత్రువుకు చిక్కకుండా వేగంగా కదులుతూ అధునాతన సాంకేతిక నైపుణ్యాలతో అవతలి వారిని చిత్తుచేయాలి. ఇప్పుడు 'మిషన్ దివ్యాస్త్ర'ను అర్థం చేసుకోవాల్సింది ఈ కోణం నుంచే.

### వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా...

ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి 2024 మార్చి 11న అగ్ని-5 క్షిపణిని తొలిసారి పరీక్షించారు. మళ్లీ తాజాగా హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు లక్ష్యాలపై విజయవంతంగా ప్రయోగించారు. ఈ రెండు పరీక్షలు అగ్ని-5 ఎంఐఆర్‌వీ సామర్థ్యాన్నీ, విశ్వసనీయతనూ నిరూపించాయి. భారతదేశ శత్రు నిరోధక సిద్ధాంతం, వ్యూహాత్మక ప్రణాళికల దిశాదశలను అగ్ని-5 వెల్లడిస్తోంది. దేశీయ దూరశ్రేణి క్షిపణి సామర్థ్యం దశాబ్దాల సంస్థాగత పెట్టుబడి, సాంకేతిక దీక్షాదక్షతల ఫలితం. ఈ కార్యక్రమ మూలాలు 1983లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాయకత్వంలో ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్(ఐజీఎండీపీ) ప్రణాళికలో ఉన్నాయి. ధనిక దేశాలు భారతదేశానికి అధునాతన క్షిపణి, ఏరోస్పేస్ సాంకేతికతలను అందుబాటులో లేకుండా చేసిన సమయంలో, స్వదేశంలోనే విస్తృత క్షిపణి వ్యవస్థల తయారీకి ఈ కార్యక్రమం దోహదపడుతోంది. ఐజీఎండీపీ ద్వారా పృథ్వి, అగ్ని, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి కీలక క్షిపణి రకాలు తయారయ్యాయి. మారుతున్న భారతదేశ వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా అగ్ని సిరీస్ అభివృద్ధి చెందింది. పాకిస్థాన్ లక్ష్యంగా స్వల్ప దూరాలను ఛేదించడానికి అగ్ని-1 రూపొందింది. అగ్ని-2, అగ్ని-3 సుదూర శత్రు లక్ష్యాలపై విరుచుకుపడతాయి. అగ్ని-4 కచ్చితత్వం, చలనశీలతలో ముందడుగు వేసింది. ఇక 'మిషన్ దివ్యాస్త్ర' ఒకే బాలిస్టిక్ క్షిపణి ద్వారా బహుళ అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం (ఎంఐఆర్‌వీ) కలిగిన అగ్ని-5ను విజయవంతంగా పరీక్షించింది. ఇది వందల కిలోమీటర్ల దూరంలోని వేర్వేరు లక్ష్యాలపైన, లేదంటే ఒకే లక్ష్యం మీద అనేక బాంబులను ప్రయోగించగలదు. అయితే, వీటిలో ప్రతి ఒక్కటీ స్వతంత్రంగా వేర్వేరు లక్ష్యాలను ఛేదించగలదు! తనకుతానుగా ఏ దేశంపైనా అణ్వస్త్రాలను ప్రయోగించకూడదనే విధానాన్ని అనుసరిస్తున్న భారత్- తనపై ఎవరైనా అణుదాడి చేస్తే మాత్రం అరిభీకరంగా విరుచుకుపడటానికి అగ్ని-5ని సిద్ధం చేసుకుంది. ఇది అయిదు వేల కిలోమీటర్లకు ఆవల ఉన్న శత్రు లక్ష్యాలపైనా విరుచుకుపడగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి(ఐసీబీఎం). చైనా, పాకిస్థాన్ సహా ఆసియాలోని ఏ ప్రాంతంపైన అయినాసరే ఇది దాడి చేయగలదు. ఆఫ్రికా, ఐరోపా ఖండాల్లోని కొన్ని ప్రాంతాలు సైతం దీని పరిధిలోకి వస్తాయి. అగ్ని-5 బాంబులతోపాటు నకిలీలను ప్రయోగించడం ద్వారా శత్రువు మోహరించిన క్షిపణి రక్షణ వ్యవస్థలను గందరగోళానికి గురిచేస్తుంది. స్వదేశీ ఏవియానిక్స్, అధిక కచ్చితత్వం కలిగిన సెన్సర్లను ఈ క్షిపణిలో పొందుపరిచారు. అందుకే ఇది శత్రు స్థావరాలపై గురితప్పకుండా విరుచుకుపడగలుగుతుంది. అగ్ని-5తో భారతదేశం ఎంఐఆర్‌వీ టెక్నాలజీ కలిగిన అతికొద్ది దేశాల జాబితాలో చేరింది. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌ల దగ్గర మాత్రమే ఈ సాంకేతికత ఉంది.

### చావుదెబ్బ తీసే సత్తా...

చైనా అనేక అధునాతన క్షిపణులను సమకూర్చుకోవడం, ప్రత్యర్థులు ప్రయోగించే క్షిపణులను అడ్డగించే సత్తాను సాధించడం, శత్రు దాడిని తట్టుకుని మరీ ఎదురుదాడి చేయగల అణ్వస్త్ర దళాలను తయారు చేసుకోవడం భారతదేశంపై ఒత్తిడిని పెంచుతోంది. పాకిస్థాన్ కూడా మన దేశంలోని అనేక ప్రాంతాలపై దాడి చేయగల క్షిపణులను చైనా సాయంతో సిద్ధం చేసుకుంటోంది. చైనా, పాకిస్థాన్ వ్యూహాలను దీటుగా ఎదుర్కోవడానికి అగ్ని-5 దివ్యాస్త్రమవుతుంది. నిజానికి 'మిషన్ దివ్యాస్త్ర' భారతదేశ సైనిక సత్తాను, సాంకేతిక సామర్థ్యాన్ని చాటడమే కాకుండా రాజకీయంగానూ సంకేతాలను పంపిస్తుంది. తనపై దాడి చేసి ఎవరూ తప్పించుకోలేరనీ, శత్రువును చావుదెబ్బ తీసే సత్తా తనకుందని భారత్ చేస్తున్న హెచ్చరికే- అగ్ని5! భారతదేశ వ్యూహాత్మక క్షిపణి అభివృద్ధిలో 'మిషన్ దివ్యాస్త్ర' చివరిది కాబోదు. అగ్ని-6ను కూడా రూపొందిస్తున్నారనే అంచనాలు వినవస్తున్నా, ప్రభుత్వం వాటిని ఇంకా నిర్ధారించలేదు. అగ్ని-6కు మరింత సుదూర పరిధి, శక్తిమంతమైన ఎంఐఆర్‌వీ ఏర్పాట్లు, జలాంతర్గామి నుంచి ప్రయోగించే సామర్థ్యం ఉంటాయని భావిస్తున్నారు. భారతదేశ వ్యూహాత్మక సంస్కృతి మొదటి నుంచీ ఆయుధ పోటీ కంటే సంయమనం, పరిమిత సామర్థ్య అభివృద్ధికే ప్రాధాన్యమిస్తూ వస్తోంది. అయితే, మారుతున్న ప్రాంతీయ భద్రతా పరిస్థితుల దృష్ట్యా మరింత అధునాతన నిరోధక వ్యవస్థలు అవసరం కావచ్చు. శత్రువుపై వేగంగా ప్రతిదాడి చేయగల సత్తాను సాధించడం అనివార్యమవుతోంది. 'మిషన్ దివ్యాస్త్ర' ఆ సామర్థ్యాన్ని భారత్‌కు అందిస్తోంది.

# భూమి కబ్జాల బెడద.. మీ ఆస్తిని చట్టబద్ధంగా ఎలా కాపాడుకోవాలి?



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భూమి వివాదాలు రోజు రోజుకు పెరుగుతూ సామాన్యుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తులు, కష్టపడి సంపాదించి కొనుగోలు చేసిన భూములు అక్రమ కబ్జాలకు గురవుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రికార్డుల గందరగోళం, నకిలీ పత్రాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాధితులు న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే చట్టం ఈ బాధితుల పక్షాన నిలుస్తోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సివిల్ కోర్టులు, రెవెన్యూ రికార్డులు, భూభారతి వంటి వ్యవస్థలను సకాలంలో వినియోగించుకుంటే మీ భూమిని కాపాడు కోవడం సాధ్యమే. అక్రమ ఆక్రమణ ఎదురైనప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఎవరిని సంప్రదించాలి? ఏ పత్రాలు కీలకం? అనే అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఇప్పుడు ప్రతి భూ యజమానికి అత్యవసరం.

### చట్ట పరంగా హక్కులు..

మీ అనుమతి లేకుండా ఎవరైనా మీ భూమిలోకి ప్రవేశిస్తే బీఎన్ఎస్ సెక్షన్ 329 కింద పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బెదిరింపులు లేదా ప్రాణహాని ఉంటే బీఎన్ఎస్ సెక్షన్ 351 కింద రక్షణ పొందవచ్చు. అయితే ఫిర్యాదు జరిగిన విషయాన్ని వివరంగా రాయడం అవసరం. పోలీసులు కేసు నమోదు చేయకపోతే పై అధికారులను లేదా కోర్టును ఆశ్రయించవచ్చు. ఇక నకిలీ భూపత్రాలు సృష్టిస్తే బీఎన్ఎస్ సెక్షన్ 336 కింద ఫిర్యాదు చేసి వారిని చట్టం ముందు నిలబెట్టవచ్చు. చట్టం కల్పించిన ఈ రక్షణ కవచాలను ఉపయోగించుకోవడం బాధితుల ప్రాథమిక బాధ్యత. కేవలం పోలీసుల ఫిర్యాదుతోనే సరిపెట్టకుండా, భూమిపై మీ హక్కును నిరూపించుకోవ డానికి సివిల్ కోర్టును ఆశ్రయించడం శ్రేయస్కరం. భూమిపై హక్కు రక్షణ కోసం సివిల్ కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ పొందితే వివాదం ముగిసే వరకు మీ భూమిని ఎవరూ తాకలేరు. అలాగే పొసెషన్ సూట్ ద్వారా మీ స్వాధీనం తిరిగి పొందే వీలుంది. కోర్టుకు వెళ్లడానికి ఆర్థిక ఇబ్బందులు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాది సహాయం, కోర్టు ఖర్చులు పొందే వీలుంది. న్యాయపరమైన చిక్కుల వల్ల భూమి చేజారి పోకుండా ఉండాలంటే ఈ వేదికలను సకాలంలో ఆశ్రయించడం ఉత్తమం.

అక్రమ మ్యూటేషన్లు ఆపడానికి..

రెవెన్యూ రికార్డుల కోసం ముందుగా తహసీల్దార్ కార్యాల యంలో 10(1) రిజిస్టర్ లేదా =ా= పత్రాలు పరిశీలించాలి. అక్కడ వివరాలు లభించకపోతే భూభారతి డిజిటల్ రికార్డులు ఉపయోగపడతాయి. ఇంకా సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్ రికార్డ్ రూమ్‌లో సేత్వార్, ఖాస్రా పహానీ వంటి పాత పత్రాలు వెతకవచ్చు. భూమి సరిహద్దులు, విస్తీర్ణం తెలుసుకోవడానికి సర్వే, భూ రికార్డుల కార్యాలయం సహాయం తీసుకోవడం మంచిది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ రికార్డులు మానవ తప్పిదాలను తగ్గించి, భూమి హక్కులకు భద్రతను కల్పిస్తాయి. భూమి రిజిస్ట్రేషన్ వివరాల కోసం ా=ాలో జుజ (ఎన్కంబరెన్స్ సర్టిఫికేట్) తీసుకుంటే భూమి గత చరిత్ర తెలుస్తుంది. తహసీల్దార్‌కు ఫిర్యాదు ఇచ్చి అక్రమ మ్యుటేషన్లు ఆపించవచ్చు. భూ భారతి రికార్డుల్లో తప్పులు ఉంటే సవరణ కోరే హక్కు మీకు ఉంది. అధికారులు స్పందించకపోతే ఆర్టికల్ 226 కింద హైకోర్టులో రిట్ పిటిషన్ వేయవచ్చు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం లేదా అక్రమాలపై పై అధికారులకు ఫిర్యాదు చేసి హక్కులను రక్షించుకోవచ్చు. రికార్డులలో పేర్లు మార్చడం అనేది ఒక సుదీర్ఘ ప్రక్రియ కాబట్టి, ముందస్తుగా అభ్యంతరం తెలపడం వల్ల పెద్ద ప్రమాదాలను తప్పించవచ్చు.

భూమి స్థితిగతులు గమనిస్తుండాలి..!

సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం కేవలం ఆక్రమణతో భూమిపై హక్కులు రావు. అన్నుమన్ సింగ్ వర్సెస్ స్టేట్' వంటి కేసుల్లో రికార్డుల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. 'పూనా రామ్ వర్సెస్ మోతీ రామ్' కేసులో చట్టబద్ధమైన పత్రాలే యాజమాన్యానికి ఆధారం అని స్పష్టం చేసింది. కాబట్టి పాత రికార్డులు సేకరించడం కొంచెం కష్టమైనా, అవి మీ భూమిని కాపాడే కవచంలా పని చేస్తాయి. చిరిగిపోయిన పాత పత్రాలను కూడా కోర్టులు ఆధారాలుగా స్వీకరిస్తాయి. ముఖ్యంగా 30 ఏళ్లకు పైబడిన పత్రాలు, కోర్టులో బలమైన సాక్ష్యాలుగా పని చేస్తాయి. తహసీల్దార్ కార్యాలయంలో మీ భూమి స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం అవసరం. అధికారులు రికార్డులు లేవని చెబితే వాటి వివరాలు లిఖితపూర్వకంగా అడగాలి. ఆ సమాచారం భవిష్యత్తులో మీకు బలాన్ని ఇస్తుంది. సరైన ఆధారాలు, చట్టంపై అవగాహన, పట్టుదల ఉంటే భూమి హక్కులను రక్షించుకోవచ్చు.

# విద్యా సమస్యలపై చర్చించని ఫిన్లాండ్ పాఠాలు!



తెలంగాణ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితారాణా నాయకత్వంలో సుమారు 40 మంది సభ్యులతో కూడిన బృందం ఇటీవల ఫిన్లాండ్‌కు అధ్యయన పర్యటన కోసం వెళ్లింది. ఈ బృందంలో 12 మంది అధికారులు, 28 మంది టీచర్లు పాల్గొన్నారు. ఫిన్లాండ్ విద్యా వ్యవస్థను అధ్యయనం చేసి, తెలంగాణలో విద్యా సంస్కరణలకు ఉపయోగపడే సూచనలు ఇవ్వడమే తమ ఉద్దేశమని అధికారులు చెప్పుకొన్నారు. అయితే, ఈ పర్యటన నివేదికను పరిశీలించినప్పుడు, కొత్త దారులను చూపిందా? తెలిసిన విషయాలనే మళ్లీ చెప్పిందా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఫిన్లాండ్‌కు వెళ్లిన తెలంగాణ విద్యాశాఖ అధికారుల బృందం అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో ఒకేషనల్ విద్యను మరింత సులభంగా, మాడ్యూల్‌ల రూపంలో, ఉద్యోగాలతో అనుసంధానం చేయాలని పేర్కొన్నది. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థలు, ఉన్నత విద్యను, పరిశ్రమలతో అనుసంధానించేలా బోధన ఉండాలని తెలిపింది. ఒకేషనల్ విద్య పట్ల అపోహలను తొలగించాలని ప్రతిపాదిస్తుంది. ఇక లోతుగా పరిశీలిస్తే ఇవి కొత్తవేమీ కావు, వ్యవస్థను పూర్తిగా మార్చే విషయాలు కూడా కావు. దీంతో ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ విజయానికి కారణాలేంటో తెలుసుకొనేలా అధ్యయనం జరగలేదని అర్థమవుతున్నది. తెలంగాణ విద్యా విధానం-2026లోనూ ఇలాంటి సూచనలనే ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగ నైపుణ్యాలు, శిక్షణలు, పరిశ్రమల అనుసంధానం వంటి అంశాలను పేర్కొన్నది. సమగ్ర అభివృద్ధి, విద్యార్థి కేంద్రిత అభ్యసనం, ఒకేషనల్ విద్యను బలపరచడం వంటి అంశాలను పొందుపర్చింది. అంటే, ఇప్పటికే రాష్ట్ర విద్యా విధానంలో ఉన్న అంశాలనే ఫిన్లాండ్ అధ్యయన నివేదికలో పేర్కొనడం ఏంటో అంతుపట్టడంలేదు. మరి ఫిన్లాండ్ పర్యటన ద్వారా కొత్తగా ఒరిగిందేమిటి? ఒకేషనల్ విద్య ఒక లోతైన సామాజిక, సాంస్కృతిక, సంస్థాగత అంశం. దీన్ని ఇంజినీరింగ్ లేదా ఇతర అకడమిక్ కోర్సులతో పోలిస్తే తక్కువదిగా భావిస్తారు. చారిత్రక అసమానతలు, ఉద్యోగ మార్కెట్ నిర్మాణం, విద్యను వస్తువుగా చూడడం వంటి కారణాల వల్ల ఈ భావన ఏర్పడింది. ఈ లోపాలను ఎలా సరిదిద్దాలో, సమస్యలను ఎలా పరిష్కరించాలో అధికారులు ఫిన్లాండ్ నివేదికలో పేర్కొనలేదు. ఫిన్లాండ్‌లో వృత్తి విద్యకు గౌరవం ఉండటానికి కారణం కేవలం మాడ్యూల్ కోర్సులు, క్రెడిట్ వ్యవస్థలు కాదు. అక్కడ కోర్సులపై విశ్వాసం, మిగతా అకడమిక్ విషయాలతో సమానత్వ భావన, బలమైన ప్రభుత్వ పెట్టుబడి ఆధారంగా ఒక బలమైన వ్యవస్థ ఉన్నది. ఉపాధ్యాయులు అత్యున్నత శిక్షణ పొందినవారు కావడం, వారికి స్వతంత్రత ఉండటం కూడా ప్రధాన కారణాలు. ఫిన్లాండ్‌లో ప్రైవేటీకరణ చాలా తక్కువ, విద్యా సంస్థలు పోటీ పడకుండా కలిసి పనిచేస్తాయి. విద్యను వ్యాపారంగా కాకుండా, ప్రజా హక్కుగా పరిగణిస్తారు. కానీ ఫిన్లాండ్ అధ్యయన బృందం తమ నివేదికలో ఈ ముఖ్యమైన అంశాలను చర్చించలేదు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఈ చర్చను మరింత క్లిష్టం చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్ వంటి బకాయిలు చెల్లించడంలోనూ ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నది. ఇలాంటి సమయంలో సుమారు కోటి రూపాయలకు పైగా ఖర్చుతో విదేశీ పర్యటన చేయడం ప్రశ్నించాల్సిన విషయమే. ఆ పర్యటన ఫలితాలు ఇప్పటికే తెలిసిన విషయాలను మళ్లీ చెప్పడమే అయితే, ఆ ఖర్చును సమర్థించడం కష్టం. దీనివల్ల ప్రభుత్వం నిజమైన సంస్కరణలను కాకుండా, కేవలం ప్రచార చర్యలనే చేపడుతున్నదా? అనే ఒక పెద్ద సందేహం వస్తున్నది. ఇలాంటి విదేశీ పర్యటనలు మీడియా దృష్టిని ఆకర్షిస్తాయి. చురుకైన పాలనను ప్రభుత్వాలు అందిస్తున్నాయనే ఆర్భాటపు ప్రచారాన్ని కలిగిస్తాయి. ఫిన్లాండ్ పర్యటన మరిన్ని ప్రశ్నలను లేవనెత్తింది కానీ, స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదు.

# సోమందేపల్లి పంచాయతీలోని మారుతి నగర్ నందు కాఫీ విత్ కేడర్ కార్యక్రమంను నిర్వహించి, గ్రామ ప్రజలను పలకరించిన మాజీ మంత్రి, వైయస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీచరణ్





సోమందేపల్లి, **ఆంధ్రజనవాడు,మే 17 :** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, సోమందేపల్లి మండలం, సోమందేపల్లి మేజర్ పంచాయతీలోని మారుతి నగర్ నందు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతి గడపకు వెళ్లి, జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాడని, ఎల్లప్పుడూ ప్రజలకు మంచి చేసే ఆలోచన ఉన్న జన నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు అని ప్రతి ఒక్కరికి గుర్తు చేశారు, నాడు జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు చేనేతల కోసం ఎంతో కృషిచేసి, నేతన్నలకు ప్రతి ఒక్కరికి ప్రతి ఏడాది రూ.24 వేల రూపాయలు అందించామన్నారు.. అంతేకాక 50 సంవత్సరాలు దాటిన అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రతి నెలా నూతన పెన్షన్ అమలు చేసిన ఏకైక నాయకుడు జగనన్న గారు అని అన్నారు, ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా అన్యాయం చేశారని, ప్రతి ఒక్కరికి వివరిస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షురాలు శ్రీమతి కేవీ ఉషశ్రీచరణ్ గారు ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల నాయకులు, వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు, సోమందేపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం పట్టణం నందు పలు కార్యక్రమాలకు హాజరైన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్



మార్కాపురం **ఆంధ్రజనవాడు,మే 17 :** మార్కాపురం పట్టణ మరియు పరిసర ప్రాంతాలలో జరిగినటువంటి పలు కార్యక్రమాలకు జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు, మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు నరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు, ఉమ్మడి రవీంద్ర, కంబం వెంకట రమణ, జక్కి వెంకటేశ్వర్లు, సున్నం కోటేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు ఆవుల వెంకట్ వీరిశెట్టి శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో బీసీ మేధోమథన సదస్సు....



విజయవాడ, **ఆంధ్రజనవాడు,మే 17 :** ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 26జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గం , వివిధ కుల సంఘ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు విజయవాడలోని బెంజ్ సర్కిల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లోబిసి మేథో మథన సదస్సు జరిగింది ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు గారు మాట్లాడుతూ




వెనుకబడిన కులాలకు న్యాయం జరిగేలా చూడటానికి రోహిణి కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలని, జన గణనలో కుల జనగణన చేపట్టాలని, చీణూ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,స్థానిక సంస్థలలో 34% రిజర్వేషన్ కల్పించడం, బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావడం, 50 ఏళ్లు పైబడిన బీసీలకు పింఛను సౌకర్యాలను అమలు చేయడం, బిసి ఉద్యోగస్తుల పిల్లలకు శాపంగా మారిన క్రీమీలేయర్ విధానాన్ని తీసివేయాలని, సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ పరిమితి అగ్రవర్ణాలకు జుఔ ద్వారా 10% రిజర్వేషన్ కల్పించడం ద్వారా 60% అయినది సుప్రీంకోర్టు విధించిన సీలింగ్ పరిమితి దాటినది దీజ జనాభాకు కూడా ఆ పరిమితిని తీసివేసి జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని తదితర అంశాలపై... ఈ కార్యక్రమంలో 13 అంశాలపై రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారు హాజరయ్యారు పెద్ద ఎత్తున బీసీ సంఘ నాయకులు, వివిధ కుల సంఘ నాయకులు హాజరయ్యారు

# హెచ్.ఐ.వి. తో జీవిస్తున్న వారిని ఆదరించండి బి ఇంచార్జి DMHO డా. శ్రీనివాస రెడ్డి



అనంతపురం, **ఆంధ్రజనవాడు,మే 17 :** హెచ్ఐవి/ ఎయిడ్స్ తో మరణించిన కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు ప్రపంచవ్యాప్తంగా మే నెల మూడో ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే గా పాటించడం 1983 వ సంవత్సరం నుండి ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవి తో పోరాడిన వారిని స్మరించుకునేందుకు హెచ్ఐవి తో జీవిస్తున్న వారి పట్ల వివక్ష ను రూపుమాపేందుకు అలాగే హెచ్ఐవి నియంత్రణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకునేలా జాగృతం చేసేందుకు ఈ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నాడు ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాలని కోరారు. అలాగే హెచ్.ఐ.వి. తో జీవిస్తున్న వారి పట్ల ఎటువంటి వివక్ష చూపరాదని తెలిపారు. హెచ్ఐవి తో మరణించినవారికి సంఘీభావంగా జరిపే ఈ క్యాండిల్ లైట్ ర్యాలీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఐఎంఎ కార్యాలయం వద్ద ప్రారంభమై, తెలుగు తల్లి విగ్రహం మీదుగా సాగి తిరిగి ఐఎంఎ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమం లో డెమో నాగరాజు, ఎజుూ గంగాధర్, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ జుం రమణ, సిబ్బంది నారాయణ స్వామి, అనంత నెట్వర్క్ వీరాంజనేయులు, జుాజ ౹ాజ రమేష్, ఈశ్వరయ్య, నరేష్, సురేష్, లింక్ వర్కర్ స్కీమ్ సిబ్బంది హుసేన్, శ్రీరాములు, వారి సిబ్బంది పాల్గొన్నారు.




# కడప నగరం మతసామరస్యానికి ప్రతీక

### అల్మాస్పేట్ ఘటనలో వైఎస్ఆర్సిపి శ్రేణులను బాధ్యులను చేయడం దుర్మార్గం

అనంతపురం, **ఆంధ్రజనవాడు,మే 17 :** అనంతపురం నగర మాజీ మేయర్ మొహమ్మద్ వసీం సలీం మరియు మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ .... కడప నగరం మత సామరస్యానికి ప్రతీక, కడప నగరంలో గతంలో ఎన్నడూ మత కలహాలు మత ఘర్షణలు చోటు చేసుకున్న దాఖలాలు లేవు అని అనంతపురం నగర పాలక సంస్థ మాజీ మేయర్ మొహమ్మద్ వసీం సలీం గారు మరియు మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. అలాంటిది ఇటీవల అల్మాస్పేట్ సర్కిల్ వద్ద చెలరేగిన ఘర్షణకు సంబంధించి సంయమనం పాటించాలని ఇరు వర్గాలకు పార్టీలకు అతీతంగా ప్రకటించారు. కానీ కొన్ని పత్రికలు కూటమి ప్రభుత్వ నేతలు మొత్తం వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రెచ్చగొట్టి ఘర్షణలకు కారణమని చెప్పడం చాలా దారుణమని మండిపడ్డారు. అదేవిధంగా ఉన్నత స్థాయిలో ఉండి మైనార్టీ వర్గానికి చెందిన వయస్సు రిత్యా పెద్దమనిషిగా వ్యవహరించే మాజీ మీజ షరీఫ్ గారు కూడా ఈ వ్యవహారాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై నెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆయన చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ మొత్తం వ్యవహారాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.




వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ రోజు కూడా ఇలాంటి నీచపు వ్యవహారానికి పాల్పడలేదని అది గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో దాన్ని దృష్టిలో పెట్టుకొని నీచపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలలో కూటమి ప్రభుత్వంపై ఎలాంటి నమ్మకం లేదనే ఉద్దేశంతో ఇలాంటి కుట్రలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం దాని ద్వారా ఎన్నికలలో లబ్ది పొందాలని నీచపు వ్యవహారానికి తెర లేపారని మండిపడ్డారు. కడప నగరంలో అలాంటి నీచపు వ్యవహారాన్ని రాజకీయాలు చేయాల్సిన అవసరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదని తెలిపారు. కుల మత రాజకీయాలు చేసే లబ్ది పొందాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి లేదని స్పష్టం చేశారు. 9వ తేది ఈ ఘటన జరిగిన రోజు టీడీపీ నగర అధ్యక్షులు ఒక వైపు మరొక వైపు టీడీపీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇంకోపక్క ఉన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అల్మాస్పెట సర్కిల్ ని టిప్పుసుల్తాన్ సర్కిల్ గ మమకారం చేస్తామని చెప్పడం నిజం కాదా అని ప్రశించారు .. రెచ్చగొట్టే రాతలు రాయించి....... రాజకీయం చేయడం టిడిపి వారికే దక్కుతుందన్నారు. ఎన్నికలలో లబ్ది పొందాలని ఉద్దేశంతోనే ఇలాంటి నీచపు రాజకీయాలకు తెరలేపారని తెలిపారు. కడప అల్మాస్పేట్ సర్కిల్ లో జరిగిన ఘర్షణకు సంబంధించి అమాయకులైన వారిని ఇరికించేందుకు కుట్ర చేసి వారిని కుట్రలో భాగంగా ఇరికించారని ఆవేదనను వ్యక్తం చేశారు. కొందరు స్వార్ధపరులు తమ స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి నీచపు వాతావరణాన్ని తీసుకురావడం చాలా బాధాకరమన్నారు.

# బీటెక్ చదివిన బాబ్జాన్ ఆర్ఎంపీ అవతారం అమాయకుల ప్రాణాలతో చెలగాటం.

### వార్తలు రాస్తే చంపేస్తామంటూ బెదిరింపుచెర్యలు.

అనంతపురం బ్యూరో, **ఆంధ్రజనవాడు,మే 17 :** గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డు సర్కిల్ వద్ద "దాదా ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరిట నడుస్తున్న క్లినిక్ ప్రస్తుతం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. బాబ్జాన్ అనే వ్యక్తి ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే ఆర్ఎంపీ డాక్టర్‌గా చలామణి అవుతూ ప్రజల ఆరోగ్యంతో ప్రమాదకరంగా ఆడుకుంటున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల సమాచారం మేరకు, బాబ్జాన్ చదివింది కేవలం బీటెక్ మాత్రమే. వైద్య విద్యతో ఎలాంటి సంబంధం లేకపోయినా డాక్టర్‌గా వ్యవహరిస్తూ క్లినిక్ నిర్వహిస్తున్నాడని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేయాల్సిన వ్యక్తి స్టెతస్కోప్ ధరించి ప్రజల ప్రాణాలతో ప్రయోగాలు చేస్తున్నాడని మండిపడుతున్నారు. అంతేకాకుండా, ఈ వ్యవహారంపై వార్తలు ప్రచురిస్తే చంపేస్తామని కొందరు వ్యక్తులు మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్నట్లు సమాచారం. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, వైద్య అర్హతలు లేకుండానే క్లినిక్ నిర్వహించడం ఎంతవరకు చట్టబద్ధమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిన్న జ్వరాల నుంచి అత్యవసర పరిస్థితుల వరకు సరైన అవగాహన లేకుండా మందులు ఇవ్వడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యుల కారణంగా ఇప్పటికే అనేక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, గుత్తిలో మాత్రం అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.




వైద్యశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు వెంటనే స్పందించి "దాదా ఫస్ట్ ఎయిడ్ సెంటర్"పై దాడులు నిర్వహించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బోగస్ వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్న బాబ్జాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నకిలీ వైద్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు హెచ్చరిస్తున్నారు.




# కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించిన యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్



ఎర్రగొండపాలెం **ఆంధ్రజనవాడు,మే 17 :** ఇటీవల ఎర్రగొండపాలెం మండలంలోని బోయినపల్లి గ్రామంలో ఎస్సీ పాలానికి చెందిన విద్యార్థులు కొమ్ము శశికుమార్ మరియు బోయలపల్లి ద్విపన్ ప్రమాదవశాత్తు వారు నీటి కుంటలో పడి మరణించడం జరిగింది. ఆ కుటుంబాలను నేడు యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారు పరామర్శించి వారి కుటుంబాలకు నేను ఉన్నానని భరోసాను కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం మండల అధ్యక్షులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# గుత్తిలో జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ 12వ రోజు



అనంతపురం బ్యూరో,**ఆంధ్రజనవాడు,మే 17 :** గుత్తి పట్టణంలో ఎం ఎస్ ఫుట్బాల్ గ్రౌండ్ నందు జి పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో 12వ రోజు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు ప్రతిరోజు నాలుగు మ్యాచ్ లు నిర్వహిస్తున్నారు. 12వ రోజు జరిగిన 1వ మ్యాచ్ నేటి పిడుగు వార్త వారియర్స్ వర్సెస్ జి ఎం సి వర్సెస్ మధ్య పోటీలు జరిగాయి. ఈ పోటీలో నేటి పిడుగు వార్త టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకుని 69 పరుగులు తీశారు. జి ఎం సి 50 పరుగులు తీసి ప్రజల హృదయాలు గెలుచుకొని మ్యాచ్ పరాజయమయ్యారు. నేటి పిడుగు వార్త వారియర్స్ విజయం సాధించారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు బొద్దుల రవి, ఆర్.బి శశిధర్,వెంకట్, సత్యనారాయణ రెడ్డి, బోయ బాలకృష్ణ, హెచ్ఎం జిలాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే మోస్ట్ బ్యూటీఫుల్ బల్లి ఇదే! అత్యధికంగా అక్రమ రవాణా అవుతుందట!

అరుదైన బల్లి జాతిని కనుగొన్న జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టులు- ఇది వరల్డ్‌లోనే అందమైన, ఎక్కువగా అక్రమ రవాణా అవుతున్న బల్లి జాతి- ఐదేళ్ల పాటు శ్రమించి విజయం సాధించిన శాస్త్రవేత్తలు ప్రపంచంలో అత్యంత అందమైన, అత్యధికంగా అక్రమ రవాణా అవుతున్న సరీసృపాల్లో ఒకటైన అరుదైన బల్లి జాతిని కనుగొన్నారు జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు. బిహార్‌లోని కైమూర్ జిల్లా అటవీ కొండలలో ఈ బల్లి జాతిని గుర్తించారు. దీనికి శాస్త్రీయంగా 'యూబ్లెఫారిస్ ఝూమా' అని నామకరణం చేశారు. ఈ క్రమంలో ఈ అరుదైన బల్లి గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

### చిరుతపులి లాంటి మచ్చలు

ఈ బల్లి శరీరంపై చిరుతపులి లాంటి మచ్చలు ఉన్నాయి. అలాగే దీని అందం కారణంగా బల్లిని 'ఝూమా లెపర్డ్ గెక్కో' అని పిలుస్తారు. అయితే ఈ అద్భుతమైన ఆవిష్కరణ (బల్లి జాతి గుర్తింపు) గురించి వివరాలు ఆస్ట్రియన్ హెర్పెటాలజికల్ సొసైటీకి చెందిన అంతర్జాతీయ పీర్ రివ్యూడ్ జర్నల్ హెర్పెటోజోవాలో మే నెల ప్రారంభంలో ప్రచురితమయ్యాయి. ఈ బల్లిని ప్రత్యేక జాతిగా నిర్ధారించి, గుర్తించడానికి సుమారు ఐదేళ్ల పరిశోధన అవసరమైంది. ఈ ఆవిష్కరణతో దేశంలో ఇప్పుడు యూబ్లెఫారిస్ ప్రజాతికి చెందిన ఏడు గుర్తింపు పొందిన బల్లి జాతులు ఉన్నాయి.

### ఐదేళ్ల శ్రమించి సక్సెస్ : సైంటిస్ట్

తాము 2021 అక్టోబర్‌లో దక్కన్ ద్వీపకల్పంలో, దాని చుట్టుపక్కల సర్వే, పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) అధ్యయనం చేశామని కోల్‌కతాలో ప్రధాన కార్యాలయం ఉన్న జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్ట్ ప్రత్యూశ్ మహాపాత్ర తెలిపారు. ఆ సమయంలో కైమూర్ వన్యప్రాణుల అభయారణ్యంలో ఇతర జాతుల కంటే భిన్నంగా ఉన్న ఒక బల్లిని చూశామని వెల్లడించారు. ఈ ప్రత్యేకమైన బల్లి పొడవు 14 సెంటి మీటర్లని పేర్కొన్నారు. అలాగే ఈ బల్లి తోక పొడవు కూడా 14 సెంటిమీటర్లేనని స్పష్టం చేశారు. ఈ బల్లికి చిరుతపులిలా ముదురు, లేత గోధుమ రంగు మచ్చలు ఉన్నాయన్నారు.

# మసకబారుతున్న మామిడి సాగు!

ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ సుమారు 45శాతం వాటాతో అగ్రస్థానంలో ఉందన్న మాటే కానీ, 1-5శాతాన్ని మించి ఎగుమతి చేయలేకపోతోంది. మనకంటే మెక్సికో, థాయ్‌లాండ్, పెరూ, బ్రెజిల్ వంటి దేశాలే ప్రపంచ మార్కెట్‌లో మెరుగ్గా నిలుస్తున్నాయి. ఇరాన్ యుద్ధం పుణ్యమాని పశ్చిమాసియా మార్కెట్లో గిరాకీ లేక మన పల్ప్ ఎగుమతులు దెబ్బతినిపోయాయి. ఫలితంగా

చిత్తూరు-తిరుపతి వంటి చోట్ల ప్రాసెసింగ్ యూనిట్లు తీవ్ర నష్టాల్లోకి జారిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రస్తుత ప్రపంచ పరిణామాలు, పశ్చిమాసియా మార్కెట్లో మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గిపోవడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన ఎగుమతులు దెబ్బతినిపోయాయి. వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి. ఫలితంగా ధరలు పతనమై పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రాసెసింగ్ యూనిట్లు వర్కింగ్ క్యాపిటల్ కొరత, రుణాల ఒత్తిడితో సతమతమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎగుమతులకు పెద్దగా ఆస్కారం లేకపోవడం వాటికి గోటిచుట్టుపై రోకటి పోటులా మారింది. రైతులు మొదలు చిన్న పరిశ్రమల నిర్వాహకుల వరకూ అందరూ ప్రభావితమవుతున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి క్లస్టర్ అనుభవమూ ఇదే. నిరుడు తోతాపురి మామిడి రైతులకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి క్వింటాలుకు 1,490 రూపాయల కనీస మద్దతు ధర ప్రకటించాల్సి వచ్చింది. ప్రస్తుత పరిస్థితులూ అందుకు భిన్నంగా ఏమీ లేవు.

గిరాకీ ఉన్నా... ఎన్నో సమస్యలు!

ప్రభుత్వ జోక్యం తాత్కాలిక ఉపశమనం కలిగించినా- రైతులకు దీర్ఘకాలంపాటు స్థిరమైన ఆదాయం అందించాలంటే మార్కెట్ మద్దతు వ్యవస్థ బలోపేతం కావాలి. ప్రాసెసింగ్ సామర్థ్యాలను విస్తరించడం, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహకానికి ప్రత్యేక చర్యలు అవసరం. అయితే, ప్రస్తుత సంక్షోభానికి మూలం నిర్మాణాత్మక లోపాల్లోనే ఉంది. రాష్ట్రంలో అనేక మామిడి తోటలు ఆర్థిక జీవితకాలాన్ని దాటిపోయాయి. సంప్రదాయ సాగు, లో-డెన్సిటీ విధానాలు, శాస్త్రీయ నిర్వహణ లోపం వల్ల దిగుబడులు, నాణ్యత తగ్గిపోతున్నాయి. ఇలాంటి పాత తోటలను పునరుద్ధరించి, హై-డెన్సిటీ, అల్ట్రా హై-డెన్సిటీ రకాలను సాగు చేయాల్సి ఉంది. ముఖ్యంగా ఎగుమతికి అనువైన మామిడి రకాలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీ సర్కారు రాయలసీమ వంటి ప్రాంతాలను హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని లక్షించింది. కానీ, లాభాలు తక్కువగా ఉండటం, సరైన మద్దతు లభించకపోవడం వంటి కారణాలతో రైతులు క్రమంగా మామిడి సాగుకు దూరమవుతున్నారు. దానిమ్మ, ఖర్జూరం, పామాయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటలకు మళ్లుతున్నారు. పంటల వైవిధ్యీకరణ ప్రయోజనకరమైనదే కానీ, మామిడికి ప్రాధాన్యం తగ్గిపోతుండటమే విచారకరం. ప్రత్యేక 'మ్యాంగో బోర్డు' ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించినా, కార్యరూపం దాల్చలేదు. దీనివల్ల పరిశోధన-అభివృద్ధి, ధరల స్థిరీకరణ, మార్కెట్ సమాచారం, ఎగుమతుల ప్రోత్సాహం, రైతులకు మద్దతు సేవలు వంటి కీలకాంశాలను సమన్వయం చేసే కేంద్రీకృత వ్యవస్థ అందుబాటులోకి రాలేదు. ఫలితంగా మామిడి రంగం సమస్యలు ఆశించినంతగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. విలువ జోడించిన మామిడి ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. భౌగోళిక గుర్తింపు కలిగిన ప్రీమియం రకాలు, బ్రాండెడ్ రిటైల్ ప్యాకెట్లు, ఆర్గానిక్ పండ్ల ఎగుమతికీ పుష్కలంగా అవకాశాలున్నాయి. ప్రవాస భారతీయులు మన మామిడి ఉత్పత్తుల కోసం నిత్యం ఎదురు చూస్తుంటారు. అయినప్పటికీ, నాణ్యతా ప్రమాణాలు, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్, కోల్డ్ చెయిన్, ఇర్రాడియేషన్ సదుపాయాల లేమి కారణంగా ఈ అవకాశాలను పూర్తిగా అందిపుచ్చుకోలేకపోతున్నాం. ప్రస్తుతం పండ్ల ఆధారిత పానీయాలను సింథటిక్ కార్బొనేటెడ్ శీతల పానీయాలతో సమానంగా పరిగణించి సుమారు 40శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దాంతో ఆరోగ్యకరమైన పండ్ల ఆధారిత సహజ పానీయాలు ప్రాధాన్యం కోల్పోతున్నాయి. అదే జీఎస్టీని 18శాతానికి తగ్గిస్తే వీటి అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయి. ఫిక్స్‌డ్ డిమాండ్ విద్యుత్ ఛార్జీలు ప్రాసెసింగ్ యూనిట్లపై తీవ్ర భారం మోపుతున్నాయి. కాబట్టి, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్లాబ్ విధానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంది. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు, కీటకాల బెడద, వ్యాధులు, నీటి కొరత దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఎరువులు, పురుగు మందులు, కూలి ఖర్చులు పెరిగిపోతున్నాయి. మార్కెట్లో ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండటం, మధ్యవర్తులపై అధికంగా ఆధారపడటం రైతులను ఆర్థికంగా కుంగదీస్తోంది. మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఆర్థికంగా, సాంకేతికంగా, మార్కెట్ పరంగా అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. పచ్చిమామిడి సరఫరాలో అస్థిరత, ధరల హెచ్చుతగ్గులు పరిశ్రమల నిర్వహణపై ప్రభావం చూపుతున్నాయి. రవాణా, నిర్వహణ వ్యయాలు పెరగడంతో లాభాలు భారీగా కోసుకుపోతున్నాయి.

ప్రత్యేక చర్యలతోనే మనుగడ

ఏపీఏమైనా మామిడి రైతులు, ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. మామిడి గుజ్జు నిల్వలు, ఇతర ఉత్పత్తుల క్లియరెన్స్ దిశగా సర్కారీ మద్దతుతో భారీగా కొనుగోళ్లు చేపట్టాలి. ఎగుమతుల కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడంతో పాటు విమానాల ద్వారా రవాణాకు సహకరించాలి. ప్రాసెసింగ్ యూనిట్లకు వర్కింగ్ క్యాపిటల్ సపోర్ట్, వడ్డీ రాయితీ వంటి తోడ్పాటు అవసరం. 'తితిదే' వంటి దేవస్థానాలు భక్తులకు మామిడి ఆధారిత పానీయాలను పంపిణీ చేయడం... బడులు, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకూ వీటిని అందించడం పరిశ్రమకు ఉపకరిస్తుంది. మరోవైపు కోల్డ్-చెయిన్ మౌలిక వసతులు, ప్యాక్-హౌస్‌లు, ఇర్రాడియేషన్ సదుపాయాలను విస్తరించుకోవాలి. మల్లవల్లిలోని ఇర్రాడియేషన్ సదుపాయాన్ని తక్షణమే కార్యాచరణలోకి తీసుకురావాల్సి ఉంది. దేశదేశాల్లో కొత్త మార్కెట్లను అన్వేషించడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడంతో పాటు పరిశోధనలు, విలువ జోడింపు ఉత్పత్తుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి. ఆర్గానిక్ సాగు, నాణ్యత ధ్రువీకరణ వ్యవస్థలను బలోపేతం చేస్తే మామిడి రంగానికి దీర్ఘకాలిక స్థిరత్వం ఒనగూడుతుంది.

# అక్షయ తృతీయకు బంగారం కొంటున్నారా ఈ నగల వ్యాపారుల భారీ డిస్కౌంట్లు!



నగల వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించడానికి రకరకాల ఆఫర్లు, పథకాలతో ముందుకు వచ్చారు. అనేక కంపెనీలు తయారీ ఛార్జీలపై 30% వరకు తగ్గింపులు, వజ్రాల విలువపై రాయితీలు, క్యాష్‌బ్యాక్ వంటివి అందిస్తున్నాయి. కొంతమంది నగల వ్యాపారులు బంగారం ధర రక్షణ. అక్షయ తృతీయ రోజున బంగారం కొనడం శుభప్రదంగా భావిస్తారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 19, ఆదివారం నాడు అక్షయ తృతీయను జరుపుకుంటారు. అక్షయ తృతీయ సందర్భంగా చాలా మంది నగల వ్యాపారులు వెండి, బంగారం, వజ్రాల ఆభరణాలపై తగ్గింపులను అందిస్తున్నారు.

తేలికపాటి ఆభరణాలు, కొత్త ఎంపికలకు డిమాండ్: గతంలో ప్రజలు పెద్దగా ఆలోచించకుండా బంగారం కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు వినియోగదారులలో అవగాహన పెరిగింది. ముఖ్యంగా యువ వినియోగదారులు బరువైన ఆభరణాల కంటే తేలికైన, నిత్యం ధరించే ఆభరణాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. 9 నుండి 18 క్యారెట్ల పరిధిలోని ఆభరణాలకు డిమాండ్ పెరుగుతోంది. అంతేకాకుండా, ప్రజలు వజ్రాలు, ల్యాబ్‌లో పెంచిన వజ్రాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, బంగారం అధిక ధర ప్రజలను వజ్రాలు లేదా డిజిటల్ గోల్డ్ వంటి ప్రత్యామ్నాయాలను అన్వేషించేలా చేస్తోంది.

**నగల వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు**

నగల వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించడానికి రకరకాల ఆఫర్లు, పథకాలతో ముందుకు వచ్చారు. అనేక కంపెనీలు తయారీ ఛార్జీలపై 30% వరకు తగ్గింపులు, వజ్రాల విలువపై రాయితీలు, క్యాష్‌బ్యాక్ వంటివి అందిస్తున్నాయి. కొంతమంది నగల వ్యాపారులు బంగారం ధర రక్షణ వంటి పథకాలను కూడా అందిస్తున్నారు. దీనిలో భాగంగా వినియోగదారులు ముందుగా కొంత మొత్తాన్ని చెల్లించి తమ బంగారం ధరను స్థిరంగా ఉంచుకుని, ఆ తర్వాత తక్కువ ధరల ప్రయోజనాన్ని పొందవచ్చు.కామా జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ కోలిన్ షా ప్రకారం.. ఈ పండుగ సీజన్‌లో ఆభరణాల రంగంలో అమ్మకాలు 10--12% మేర పెరుగుతాయని అంచనా. బంగారం, 22-క్యారెట్ల ఆభరణాలపై పెట్టుబడులు కొనసాగుతున్నప్పటికీ, యువతలో 9--18 క్యారెట్ల శ్రేణిలోని తేలికపాటి, నిత్యవసర ఆభరణాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని ఆయన తెలిపారు. ధరలలోని హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులను ఆకర్షించడానికి రిటైలర్లు వివిధ ఆఫర్లు, పథకాలతో ముందుకు వచ్చారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, బంగారం, కట్ చేయని, రత్నాల ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలపై 30% వరకు తగ్గింపును, అలాగే వజ్రాల విలువపై 30% వరకు తగ్గింపును అందిస్తోంది. ఎస్‌బిఐ కార్డులతో చేసే కొనుగోళ్లపై రూ.4,000 వరకు క్యాష్‌బ్యాక్ కూడా అందిస్తున్నారు. ఆదిత్య బిర్లా జ్యువెలరీ ఇంద్రియ, మేకింగ్ ఛార్జీలు, వజ్రాల విలువపై 35% వరకు తగ్గింపును అందిస్తోంది. అదనంగా డబుల్ గోల్డ్ రేట్ ప్రొటెక్షన్ ప్లాన్ కింద వినియోగదారులు 25% అడ్వాన్స్ ధరను ఖరారు చేసుకుని, తర్వాత తక్కువ రేటు ప్రయోజనాన్ని పొందవచ్చు. కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ కూడా ఇదే తరహా బంగారు ధర రక్షణ పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ఒక చిన్న చెల్లింపుతో ధరను స్థిరంగా ఉంచుకోవచ్చు. కంపెనీ ప్రకారం, వారి వార్షిక అమ్మకాలలో అక్షయ తృతీయ వాటా 15--18% ఉంటుంది. సోలిటారియో ఈ సీజన్‌లో వజ్రాల ఆభరణాలను ప్రోత్సహిస్తోంది. బంగారం బదులుగా వజ్రాలను కొనుగోలు చేయమని వినియోగదారులను ప్రోత్సహిస్తూ, మొదటి 101 మంది కస్టమర్లకు ఉచితంగా వజ్రాలను అందిస్తోంది. ఈ బ్రాండ్ ల్యాబ్-గ్రోన్ డైమండ్ జ్యువెలరీపై కూడా దృష్టి సారిస్తోంది. లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ వ్యవస్థాపకురాలు పూజా మాధవన్ ప్రకారం, పెరుగుతున్న బంగారం ధరలు ప్రజలను ల్యాబ్-గ్రోన్ డైమండ్స్ వంటి అధిక విలువ గల ఎంపికల వైపు నడిపిస్తున్నాయి. ఈ కంపెనీ వజ్రాల విలువపై 30% వరకు తగ్గింపు, తయారీ ఛార్జీలపై 50% వరకు తగ్గింపు, ఏ కొనుగోలుపైనైనా ఒక ఉచిత బంగారు నాణేన్ని అందిస్తోంది. ఈ ఆఫర్ ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటులో ఉంటుంది. ఈ రోజుల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బంగారంలో పెట్టుబడి పెట్టడం సులభమైంది. పేటీఎం వంటి ప్లాట్‌ఫారమ్‌లు ప్రజలు చిన్న మొత్తాలతో 24-క్యారెట్ బంగారంలో పెట్టుబడి పెట్టడానికి వీలు కల్పిస్తున్నాయి. అవి ఎాహ్రూ ఆప్షన్లు, తక్షణ అమ్మకం-కొనుగోలు సేవలను అందిస్తూ, కొత్త పెట్టుబడిదారులు చేరడాన్ని సులభతరం చేస్తున్నాయి. ఈ బంగారాన్ని సురక్షితమైన ఖజానాలలో భద్రపరుస్తారు. అలాగే దీనిని వంటి కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహిస్తారు.

# ఆభరణాల ఎగుమతులు డౌన్.. మార్చిలో 35 శాతం తగ్గిన జెమ్స్, జ్యువెల్లరీ ఎక్స్‌పోర్ట్స్

ముంబై, ఏప్రిల్ 14 : దేశీయ ఆభరణాల ఎగుమతులకు యుద్ధం సెగ గట్టిగానే తగిలింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ జెమ్స్ అండ్ జ్యువెల్లరీ ఎగుమతులు 35 శాతం తగ్గుముఖం పట్టాయి. మార్చి నెలలో 27,717.40 మిలియన్ డాలర్లకు(రూ.2,44,827.26 కోట్లు) పరిమితమయ్యాయని ఇండస్ట్రీ బాడీ జీజేఈపీసీ తాజాగా వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో 28,669.53 మిలియన్ డాలర్లు(రూ.2,42,559.39 కోట్లు)గా నమోదయ్యాయని జెమ్ అండ్ జ్యువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టిన ఎగుమతులు వచ్చే రెండు నుంచి మూడు నెలల వరకు కోలుకునే అవకాశాలు లేవని, ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అస్థిరత పరిస్థితులు దీర్ఘకాలికంగా కొనసాగితే ఎగుమతులు ఇప్పట్లో పుంజుకునే అవకాశాలు లేవని జీజేఈపీసీ వర్గాలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సద్దుమణిగిన తర్వాతనే ఆభరణాల ఎగుమతులు పెరుగనున్నాయన్నారు. మరోవైపు, కట్ అండ్ పాలిష్ డైమండ్ల ఎగుమతులు కూడా 27.48 శాతం తగ్గి 838.75 మిలియన్ డాలర్లకు(రూ.7,798.82 కోట్లు) తగ్గాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 1,156.60 మిలియన్ డాలర్లు(రూ.10,002.52 కోట్లు)గా నమోదయ్యాయి. 2025-26లో కట్ అండ్ పాలిష్ డైమండ్ల ఎగుమతులు 8.52 శాతం తగ్గి 12,159.83 మిలియన్ డాలర్లు(రూ.1,07,461.34 కోట్లు)గా నమోదయ్యాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 11,364.32 మిలియన్ డాలర్లు(రూ.1,00,277.64 కోట్లు) విలువైన బంగారు ఆభరణాలు ఎగుమతి అయ్యాయి. అంతక్రితం ఏడాది అయిన 11,367.42 మిలియన్




డాలర్ల(రూ.96,254.5 కోట్లు)తో పోలిస్తే తగ్గాయి. వెండి ఆభరణాల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 52.21 శాతం ఎగబాకి 1,467.47 మిలియన్ డాలర్లకు(రూ.13,013.54 కోట్లు)కు చేరాయి. అంతక్రితం ఏడాది ఇది 964.10 మిలియన్ డాలర్లు(రూ.8,135.78 కోట్లు)గా ఉన్నాయి.'పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు జెమ్స్ అండ్ జ్యువెల్లరీ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. డైమండ్ ఎగుమతులు కూడా భారీగా పడిపోయాయి.

# నమ్మకమైన నేస్తం పటిష్టమైన బంధం.. రక్షణ, ఇంధన రంగాల్లో భారత్-రష్యా నూతన అధ్యాయం..!



మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2026 సెప్టెంబర్‌లో భారతదేశంలో జరగనున్న బ్రిక్స్ (దీ=×జూ) సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారని అలీపోవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు పుతిన్ భారత్ పర్యటన కోసం ఇరు దేశాల ఉన్నత స్థాయి అధికారులు చర్చలు జరుపుతున్నారు. ప్రపంచ వేదికపై భారతదేశం పోషిస్తున్న నిర్ణయాత్మక పాత్రకు రష్యా పూర్తి మద్దతు ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతోందని అలీపోవ్ తెలిపారు. మిగిలిన ఎస్-400 క్షిపణి వ్యవస్థను భారత్ త్వరలోనే అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా సత్తాతో ముడిపడిన బ్రహ్మోస్ క్షిపణులు, ఏకే-203 రైఫిల్‌ల తయారీని రష్యా-భారత్ విజయగాథలుగా ఆయన అభివర్ణించారు. అత్యాధునిక ఎస్‌యు-57 యుద్ధ విమానాలపై భారత్ ఆసక్తి కనబరిచిందని, అయితే భద్రతా కారణాల దృష్ట్యా రక్షణ ఒప్పందాల పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు అలీపోవ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు రష్యా ఒక నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతోందన్నారు. ముడి చమురు, ఎల్‌పిజి సరఫరాలను రష్యా నిరంతరం కొనసాగిస్తుందని రాయబారి అలీపోవ్ హామీ ఇచ్చారు. "భారత్-రష్యా మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాము. ఇది కొంచెం కష్టమైనా, ఖచ్చితంగా సాధించదగినదే." అని డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం చమురు కొనుగోళ్ల వల్ల వాణిజ్యం రష్యా వైపు మొగ్గు చూపుతోంది. దీనిని సమతుల్యం చేయడానికి వ్యవసాయ ఉత్పత్తులు, యంత్రాల ఎగుమతులను పెంచాలని భారత్‌ను రష్యా కోరుతోంది. ముఖ్యంగా, 95 శాతం వాణిజ్య లావాదేవీలు సొంత కరెన్సీల్లోనే జరుగుతుండటం వల్ల అమెరికా ఆంక్షల ప్రభావం గణనీయంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతలపై అలీపోవ్ స్పందిస్తూ, అమెరికా ఇజ్రాయెల్ దాడులను ఖండించారు. ఇరాన్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఉందని, శాంతియుత అణుశక్తిని ఉపయోగించుకునే హక్కును గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ దేశాల ఒత్తిడిని అధిగమిస్తూ, భారత్-రష్యా సంబంధాలు మరింత పటిష్టంగా ముందుకు సాగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్టాక్ మార్కెట్లపై మళ్లీ యుద్ధం దెబ్బ.. భారీగా నష్టపోతున్న సూచీలు




స్టాక్ మార్కెట్ల పై మళ్లీ యుద్ధం దెబ్బ పడింది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. చర్చలు విఫలం కావడంవల్ల అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 101 డాలర్‌లు దాటింది. దాంతో మార్కెట్‌లపై బేర్ పట్టుబిగించింది. అదేవిధంగా ఇరాన్ పోర్టులను, ఆ పోర్టులకు వచ్చిపోయే నౌకలకు తమ బలగాలు దిగ్బంధిస్తాయని ట్రంప్ హెచ్చరించడం కూడా స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. అదేవిధంగా ఇరాన్‌పై మళ్లీ దాడులకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నదన్న వార్తలు కూడా స్టాక్ మార్కెట్లను నష్టాల్లో ముంచాయి. దాంతో ఇవాల్టి ట్రేడింగ్‌లో 76,134 పాయింట్ల వద్ద ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్.. ఏకంగా 1,415 పాయింట్లు కోల్పోయింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 479 పాయింట్లు కోల్పోయి 23,571 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది.

# 8వ వేతన సంఘం నుంచి ఉద్యోగ ప్రకటన! 12 రోజుల పనికి రూ.90 వేలు




8వ వేతన సంఘం పరిశోధన బృందంలో పనిచేయాలనుకుంటున్నారా? సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు రూ.1.8 లక్షల వరకు జీతంతో ఖాళీలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు సిఫార్సులు చేసే ఈ బృందంలో ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్ అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై చర్చలు జరుగుతున్న వేళ 8వ వేతన సంఘం నుంచి ఒక ఆసక్తికర ప్రకటన వెలువడింది. జీతాల పెంపు ఎప్పుడు అమలు అవుతుందనే ప్రశ్నల మధ్య, ఈ కమిషన్‌లో పనిచేయాలనుకునే వారికి కన్సల్టెంట్ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ప్రకటించబడటం గమనార్హం. ఈ నియామకాలు ప్రధానంగా పరిశోధన, విశ్లేషణ పనుల కోసం ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, భత్యాలు, పెన్షన్‌లపై సిఫార్సులు రూపొందించడంలో ఈ బృందం కీలక పాత్ర పోషిస్తుంది. ఎంపికైన అభ్యర్థులు సాధారణ కార్యాలయ పనుల కంటే డేటా విశ్లేషణ, విధాన పరిశోధనలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్, యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి. సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు 10 సంవత్సరాలకుపైగా అనుభవం అవసరం కాగా, వయోపరిమితి 45 సంవత్సరాలు. కన్సల్టెంట్ పోస్టుకు కనీసం 6 సంవత్సరాల అనుభవం, 40 సంవత్సరాల లోపు వయస్సు అవసరం. యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు 4 సంవత్సరాల అనుభవం, 32 సంవత్సరాల వయోపరిమితి ఉంటుంది. జీతాల విషయానికి వస్తే ఈ అవకాశాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. సీనియర్ కన్సల్టెంట్‌కు పూర్తికాలపు ఉద్యోగంలో నెలకు రూ.1.80 లక్షల వరకు వేతనం లభిస్తుంది. పార్ట్‌టైమ్ ఎంపికల్లో పనిచేసే రోజులకు అనుగుణంగా రూ.90,000 లేదా రూ.45,000 వరకు జీతం ఉంటుంది. కన్సల్టెంట్ పోస్టుకు పూర్తికాలపు జీతం రూ.1.20 లక్షలు కాగా, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.90,000 వరకు లభిస్తుంది. పార్ట్‌టైమ్ ఎంపికల్లో కూడా అనుపాతంగా జీతం అందుతుంది. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థుల దరఖాస్తులను సమీక్షించి, తదుపరి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. చివరి నిర్ణయం కమిషన్‌కే ఉంటుంది, దాని నిర్ణయం తుది నిర్ణయంగా పరిగణించబడుతుంది.

# వేసవి ప్రయాణికులకు ఊరట వివిధ ప్రాంతాల మధ్య స్పెషల్' ట్రైన్స్!



ఈ వేసవిలో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది రైల్వే. ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 2ూజ, 3ూజ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. మీ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకుని టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవాల్సిందిగా రైల్వే శాఖ సూచించింది.. వివిధ ప్రాంతాల మధ్య 'సమ్మర్ వీక్లీ స్పెషల్' రైళ్లువేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు గమ్యస్థానాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు ఏప్రిల్ నెలలో అందుబాటులో ఉంటాయి. ఈ సమ్మర్ సీజన్‌లో ప్రత్యేక రైళ్ల వల్ల ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగించనున్నాయి.

డ్రైవర్ల ఆటో, ట్యాక్సీ లైసెన్స్‌ల రద్దు.. ఆ ప్రభుత్వం కీలక నిర్ణయం.. అసలు మ్యాటర్ ఇదే!

ముఖ్యమైన రైళ్ల వివరాలు:

1. చెన్నై సెంట్రల్ సంత్రాగచ్చి చెన్నై బీచ్: ఏప్రిల్ 16న (గురువారం) ఉదయం 06.55 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది.

రైలు నం. 06068: ఏప్రిల్ 17న (శుక్రవారం) మధ్యాహ్నం 14.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, శనివారం సాయంత్రం 18.30 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది.

స్టాపింగ్స్: విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గుడూరు, ఒంగోలు, దువ్వాడ, విజయనగరం వంటి ముఖ్య ప్రాంతాల్లో ఈ రైళ్లు ఆగుతాయి.

2. సహర్సా యశ్వంత్‌పూర్ సహర్సా: రైలు నం. 05551 ఏప్రిల్ 16 నుండి 30 వరకు ప్రతి గురువారం రాత్రి 20.25 గంటలకు బయలుదేరుతుంది. రైలు నం. 05552: ఏప్రిల్ 19 నుండి మే 3 వరకు ప్రతి ఆదివారం ఉదయం 07.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరుతుంది.

**ముఖ్యమైన స్టాపింగ్స్:** ఏపీ. తెలంగాణలోని విజయవాడ, గుంటూరు, మార్కాపురం రోడ్, నంద్యాల, ధోన్, గూటి, అనంతపురం, ధర్మవరం స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

**3. పోడనూర్ ఖరగ్‌పూర్ చెన్నై బీచ్:** రైలు నం. 06065 ఏప్రిల్ 16 (గురువారం) రాత్రి 23.00 గంటలకు పోడనూర్ నుండి బయలుదేరుతుంది.

**రైలు నం. 06066:** ఏప్రిల్ 18 (శనివారం) మధ్యాహ్నం 15.30 గంటలకు ఖరగ్‌పూర్ నుండి బయలుదేరుతుంది.

**స్టాపింగ్స్:** కాట్పాడి, రేణిగుంట (06065కు మాత్రం), నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ స్టేషన్లలో హాల్ట్స్ ఉంటాయి

కోచ్‌ల వివరాలు: ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 2AC, 3AC, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

## ఓవైపు యుద్ధం.. మరోవైపు గోల్డ్, సిల్వర్ ETFల జోరు! ఇప్పుడు పెట్టుబడి మంచిదేనా?




మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక మార్కెట్లను ప్రభావితం చేయడంతో, బంగారం, వెండి వంటి సురక్షిత ఆస్తుల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా, గోల్డ్, సిల్వర్ జుఖీల ధరలు గణనీయంగా పెరిగాయి. కొన్ని సిల్వర్ జుఖీలు 10 శాతం పైగా లాభపడగా, గోల్డ్ జుఖీలు స్థిరమైన వృద్ధిని చూపాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం లేదా రాజకీయ అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సాధారణంగా సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతారు. అందుకే బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు ఇటీవలి రోజుల్లో గణనీయంగా పెరిగాయి. ఈ పెరుగుదలతో బంగారం, వెండి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ETFలు) కూడా మంచి లాభాలను చూపుతున్నాయి. కొన్ని జుఖీల విలువ కొద్ది రోజుల్లోనే 5 నుండి 10 శాతం వరకు పెరగడం పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగా యుద్ధ పరిస్థితులు లేదా ఆర్థిక అనిశ్చితి ఉన్నప్పుడు స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతాయి. అటువంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ డబ్బును రక్షించుకోవడానికి బంగారం, వెండి వంటి సేఫ్ హెవెన్ ఆస్తులలో పెట్టుబడి పెడతారు. దీనివల్ల వాటి డిమాండ్ పెరిగి ధరలు కూడా ఎగసిపడతాయి. ఈ పరిస్థితుల ప్రభావం లలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. లు బంగారం లేదా వెండి ధరలను నేరుగా అనుసరించే పెట్టుబడి సాధనాలు. అంతర్జాతీయ మార్కెట్లో లోహాల ధరలు పెరిగితే, వాటి జుఖీల నికర ఆస్తి విలువ కూడా పెరుగుతుంది. ఇటీవల విడుదలైన డేటా ప్రకారం వెండి ETFలు ఎక్కువ లాభాలను నమోదు చేశాయి. సిల్వర్ జుఖీ సుమారు 10.87 శాతం, టాటా సిల్వర్ 10.80 శాతం, సిల్వర్ ETF దాదాపు 8.81 శాతం పెరిగాయి. వెండి ధరలు సాధారణంగా బంగారం కంటే వేగంగా మారుతుండటంతో ల లాభాలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో గోల్డ్ ETFలు కూడా స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. క్వాంటమ్ గోల్డ్ ఫండ్ సుమారు 5.31 శాతం పెరిగితే, గోల్డ్ ETF, కోటక్ గోల్డ్ ETF దాదాపు 5.29 శాతం లాభాలను సాధించాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. తక్షణ లాభాల కోసం కాకుండా దీర్ఘకాల పెట్టుబడి దృష్టితో గోల్డ్ ETFలు స్థిరమైన ఎంపికగా పరిగణించవచ్చు. అయితే మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ దశలవారీగా పెట్టుబడి పెట్టడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## గల్ఫ్‌లో గందరగోళం.. దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయా?.. క్లారిటీ ఇచ్చిన సర్కార్..!






మధ్యప్రాచ్యంలో నెలకొన్న గందరగోళాన్ని చూసిన ప్రతి సామాన్యుడికి ఒక ప్రశ్న తొలచివేస్తుంది. భారతదేశంలో పెట్రోల్ – డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయా? ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఇది చాలా భరోసా ఇచ్చే సమాధానం. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్ – డీజిల్ ధరలలో పెరుగుదల ఉండదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న గందరగోళాన్ని చూసిన ప్రతి సామాన్యుడికి ఒక ప్రశ్న తొలచివేస్తుంది. భారతదేశంలో పెట్రోల్ – – డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయా? ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఇది చాలా భరోసా ఇచ్చే సమాధానం. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్ –– డీజిల్ ధరలలో పెరుగుదల ఉండదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. భారతదేశ ఇంధన నిల్వలు నిరంతరం మెరుగుపడుతున్నాయి. ఇది ప్రజల జేబులపై ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గిస్తుంది. ఇజ్రాయెల్– అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి దగ్గర ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికిపైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆంటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది. అయితే ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధంతో పెట్రోల్ షార్టేజ్ వస్తుందని ఇప్పటినుంచే నిల్వ చేయడం మొదలుపెట్టేశారు. ధరలు పెరుగుతాయన్న ఆందోళన మొదలైంది.

### ముడి చమురుపై కేంద్రం 'పరిపూర్ణ' వ్యూహం!

ఈ భౌగోళిక రాజకీయ సంక్షోభాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం తన దిగుమతి విధానంలో గణనీయమైన మరియు గణనీయమైన మార్పును తీసుకుంది. గతంలో, ముడి చమురు కోసం మనం హార్ముజ్ జలసంధి మార్గంపై ఎక్కువగా ఆధారపడి ఉండేవాళ్ళం. ఇప్పుడు, ప్రభుత్వం ఇతర, సురక్షితమైన ఎంపికల నుండి చమురు దిగుమతులను 10 శాతం పెంచింది. దీని ప్రత్యక్ష ఫలితంగా, గతంలో 60 శాతం ఉన్న హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు ఇప్పుడు 70 శాతానికి పెరిగాయి. ఈ వ్యూహాత్మక చర్యకు ధన్యవాదాలు, మనకు ఇప్పుడు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల తగినంత సౌకర్యవంతమైన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

### వంట గ్యాస్ (LPG) -- LNG పై ప్రభావం ఎంత?

గత 12 సంవత్సరాల డేటాను పరిశీలిస్తే, ఉజ్వల యోజన లబ్ధిదారులకు సిలిండర్ ధర రూ. 110 పెరిగింది. ఈ ధర 2014లో సిలిండర్‌కు రూ. 500 నుండి ఇప్పుడు రూ. 610కు చేరుకుంది. ఇటీవలి రోజుల్లో ూా+ నిల్వల గురించి కొన్ని ఆందోళనలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం ఇప్పుడు ఉత్పత్తిని తిరిగి ప్రాధాన్యత ఇవ్వడానికి వేగంగా కృషి చేస్తోంది. పరిస్థితి ఇప్పుడు నియంత్రణలో ఉందని ప్రభుత్వం తెలిపింది. సహజ వాయువు రంగంలో భారతదేశం కూడా బలమైన స్థానాన్ని సంపాదించింది. ఇరాన్ దాడులు, హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతల కారణంగా ఖతార్‌లోని రాస్ లఫాన్ ఉత్పత్తి కేంద్రం ప్రస్తుతం మూసివేశారు. అయితే, సరఫరా మార్గం తిరిగి తెరిచిన వెంటనే గ్యాస్ సరఫరాలను తిరిగి ప్రారంభిస్తామని ఖతార్ భారతదేశానికి హామీ ఇచ్చింది. ప్రస్తుత ఓదార్పు ఏమిటంటే, దేశంలో ఇప్పటికే మిగులు ూచీ+ నిల్వలు ఉన్నాయి. అనేక ఇతర దేశాలు కూడా ూచీ+ సరఫరా చేయడానికి భారతదేశానికి ప్రతిపాదనలను సమర్పిస్తున్నాయి. భారతదేశంలో ఎరువుల ఉత్పత్తి, దిగుమతి రెండూ గ్యాస్ సరఫరాపై ఆధారపడి ఉన్నందున, ఎరువుల మంత్రిత్వ శాఖతో ఉన్నత స్థాయి చర్చలు కూడా జరుగుతున్నాయి.

### హార్ముజ్‌లో ఓడల రాకపోకలు పునఃప్రారంభం

ఇదిలావుంటే, తాజాగా హార్ముజ్ జలసంధి ద్వారా సరుకు రవాణా తిరిగి ప్రారంభమైంది. ఇరాన్ అధ్యక్షుడు మహమూద్ పెజెష్కియన్ ఇరాన్ పొరుగు దేశాలు తమ సొంత భూభాగం నుండి దాడి చేయకపోతే వాటిని లక్ష్యంగా చేసుకోదని హామీ ఇచ్చిన తర్వాత ఈ మార్పు వచ్చింది.

# సీమకిరణం ఎఫెక్ట్ : అధికారుల స్పందన... సమస్య పరిష్కారం






### వినియోగదారులకు రూపాయి ఖర్చు లేకుండా 7 ప్రభుత్వ కాలనీల నిర్మాణం!

పాత ప్రభుత్వ నివాస గృహాలు చాలా సంవత్సరాల క్రితం నిర్మాణం అయ్యాయి. కాలక్రమేణా అవి పాడైపోయి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం దాదాపు 40 శాతం గృహాలు నివసించడానికి అనర్హంగా మారాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ..

భారత ప్రభుత్వం ఢిల్లీలో ఉన్న పాత ప్రభుత్వ గృహ కాలనీలను ఆధునికంగా మార్చేందుకు పెద్ద ప్రణాళికను చేపట్టింది. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారుల డబ్బు ఖర్చు చేయకుండా స్వయం ఆర్థిక నమూనా (ావశ్రీట-ఖీఱఅఖుఅఎఱఅస్త్ర వీశీసవశ్రీ) ద్వారా ఈ ప్రాజెక్టును అమలు చేయడం విశేషం. ఈ పునర్వికాస ప్రాజెక్టులో మొత్తం 7 ప్రభుత్వ కాలనీలు ఉన్నాయి. అవి సరోజిని నగర్, నేతాజీ నగర్, నౌరోజీ నగర్, కస్తూర్బా నగర్, త్యాగరాజ్ నగర్, శ్రీనివాసపురి, మహ్మద్‌పూర్. ఈ కాలనీలు కలిపి సుమారు 537 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి.



**1 / 6**

ఇక్కడ ఉన్న పాత ప్రభుత్వ నివాస గృహాలు చాలా సంవత్సరాల క్రితం నిర్మాణం అయ్యాయి. కాలక్రమేణా అవి పాడైపోయి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం దాదాపు 40 శాతం గృహాలు నివసించడానికి అనర్హంగా మారాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20,000 కంటే ఎక్కువ గృహాల కొరత కూడా ఉంది.

**2 / 6**

ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కాలనీలను పూర్తిగా పునర్నిర్మించాలని నిర్ణయించింది. పాత తక్కువ అంతస్తుల భవనాలను తొలగించి, ఆధునిక హై-రైజ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 21,000కు పైగా కొత్త ఫ్లాట్లు నిర్మిస్తారు. అదనంగా మెరుగైన రోడ్లు, పార్కులు, కమ్యూనిటీ సదుపాయాలు వంటి మౌలిక వసతులు కూడా అందుబాటులోకి వస్తాయి.

**3 / 6**

మార్చి 8న ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 2,722 కొత్త ఫ్లాట్లను ప్రారంభించనున్నారు. అలాగే 6,632 కొత్త ఫ్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పనులు జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకమోడేషన్ (ూ=ూ) పునర్వికాస ప్రణాళిక కింద సరోజిని నగర్, నేతాజీ నగర్, కస్తూర్బా నగర్, శ్రీనివాసపురి ప్రాంతాల్లో జరుగుతున్నాయి.

**4 / 6**

ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా నిలిపేది దాని స్వయం ఆర్థిక విధానం. సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులకు ప్రభుత్వ ఖజానా






నుంచి భారీగా నిధులు ఖర్చు అవుతాయి. కానీ ఈ ప్రాజెక్టులో అలా కాదు. మొత్తం ప్రాజెక్టు విస్తీర్ణంలో కేవలం 69.41 ఎకరాలు. అంటే మొత్తం ప్రాంతంలో 12.9 శాతం మాత్రమే. వాణిజ్య, నివాస అవసరాల కోసం అభివృద్ధి చేసి విక్రయించనున్నారు. ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయంతోనే ప్రాజెక్టు ఖర్చును భరిస్తారు. ఈ పరిమిత భూమి వినియోగం ద్వారా ప్రభుత్వం సుమారు రూ.35,100 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు మొత్తం పునర్వికాస ఖర్చు సుమారు రూ.32,800 కోట్లు అవుతుంది.

**5 / 6**

దీంతో ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులపై ఎలాంటి భారం లేకుండా ఈ భారీ ప్రాజెక్టును పూర్తి చేయగలుగుతుంది. అంతేకాదు, ఖర్చులు తీర్చిన తర్వాత కూడా సుమారు రూ.2,300 కోట్లకు పైగా మిగులు ప్రభుత్వానికి లభించే అవకాశముంది. ఈ విధంగా ఆధునిక గృహాలు, మెరుగైన మౌలిక వసతులు అందించడంతో పాటు ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు ఢిల్లీలో ఒక ప్రత్యేక పట్టణాభివృద్ధి నమూనాగా నిలుస్తోంది.

## రూ.39 ప్లాన్‌లో రోజుకు 3+B డేటా.. రూ.45 ప్లాన్‌లో మొత్తం 25+దీ డేటా.. చౌకైన డేటా ప్లాన్స్!




రిలయన్స్‌జియోలో కొన్ని డేటా ప్లాన్‌లు చౌకగా ఉన్నాయి. ఎంతో మంది డేటా ప్లాన్స్ వాడుతుంటారు. ఎక్కువ డేటా వినియోగించే వారికి ఈ ప్లాన్స్ అద్భుతంగా ఉంటాయి. అతి తక్కువ ధరల్లోనే రోజువారీ డేటాను అందిస్తున్నాయి. ఈ ప్లాన్స్ వివరాలు ఏంటో తెలుసుకుందాం..

మీరు ఇంటర్నెట్ వినియోగానికి ఉత్తమమైన యాడ్-ఆన్ డేటా ప్యాక్‌ల కోసం చూస్తున్నట్లయితే జియో మీ కోసం కొన్ని గొప్ప ఎంపికలను అందిస్తుంది. ఇక్కడ రూ. 80 లోపు కొన్ని ఉత్తమ జియో డేటా ప్యాక్‌ల గురించి తెలుసుకుందాం. వీటిలో ఒకటి రూ.39 ప్యాక్. ఇది రోజుకు 3+దీ డేటాను అందిస్తుంది. సోనీ లివ్‌కు ఉచిత యాక్సెస్‌ను అందించే డేటా ప్యాక్ కూడా ఉంది. ఈ డేటా ప్యాక్‌లను నిశితంగా పరిశీలిద్దాం.

**1 / 5**

రూ.19 డేటా ప్యాక్: ఈ జియో డేటా ప్యాక్ ఒక రోజు చెల్లుబాటుతో వస్తుంది. కంపెనీ ఇంటర్నెట్ వినియోగానికి 1+B డేటాను అందిస్తోంది.

**2 / 5**







రూ.29 డేటా ప్యాక్: ఈ జియో ప్లాన్ చెల్లుబాటు రెండు రోజులు. ఇంటర్నెట్ వినియోగం కోసం మీకు మొత్తం 2+దీ డేటా లభిస్తుంది.

**3 / 5**

రూ.49 డేటా ప్యాక్: ఈ జియో డేటా ప్యాక్ ఒక రోజు చెల్లుబాటుతో వస్తుంది. కంపెనీ 25+B ఇంటర్నెట్ డేటాను







అందిస్తోంది. అలాగే రూ.69 డేటా ప్యాక్: ఈ ప్లాన్ ఏడు రోజుల చెల్లుబాటుతో వస్తుంది. కంపెనీ 6+B ఇంటర్నెట్ డేటాను అందిస్తోంది.

**4 / 5**

రూ.77 డేటా ప్యాక్: ఈ జియో డేటా ప్యాక్ ఐదు రోజుల చెల్లుబాటుతో వస్తుంది. కంపెనీ రోజుకు 3+దీ డేటాను అందిస్తోంది. ఈ ప్లాన్‌లో సోనీ లివ్ యాక్సెస్ కూడా ఉంది.

## రూ.50 వేల డౌన్ పేమెంట్‌తో ఈ మారుతి కారు కొంటే నెలవారీ EMI ఎంత ఉంటుంది?












చాలా మందికి కారు కొనాలనే ఆశ ఉంటుంది. కానీ అది అందరికి నెరవేరకపోవచ్చు. ఎందుకంటే లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒకే సారి మొత్తం డబ్బు పెట్టి కొనలేని వారు ఈఎంఐ పద్దతుల్లో తీసుకుంటారు. మరి ఈ మారుతి కారు కొనేందుకు 50 వేల రపాయల డౌన్ పేమెంట్ చేస్తే నెలవారీ ఈఎంఐ ఎంత ఉంటుందో చూద్దాం..

మీరు మీ కుటుంబానికి ఆర్థికంగా, మంచి మైలేజీని అందించే కారు కోసం చూస్తున్నట్లయితే మారుతి ఎర్టిగా మంచి ఎంపిక కావచ్చు. ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు పూర్తి డౌన్ పేమెంట్ చేయవలసిన అవసరం లేదు. మీరు రూ.1.5 లక్షల డౌన్ పేమెంట్ చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సులభమైన EMIలలో చెల్లించడం ద్వారా ఫైనాన్స్‌లో కూడా కొనుగోలు చేయవచ్చు.

**1 / 5**

కొత్త మారుతి సుజుకి ఎర్టిగా ధర ఇప్పుడు దాదాపు రూ.8.80 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభమవుతుంది. టాప్-స్పెక్ వేరియంట్ దాదాపు రూ.12.94 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది. బేస్ ాశ× పెట్రోల్ మోడల్ కోసం ఢిల్లీలో ఆన్-రోడ్ ధర, ూ, బీమాతో సహా దాదాపు రూ.10 లక్షల వరకు ఉంటుంది.

**2 / 5**

కొత్త మారుతి సుజుకి ఎర్టిగా ధర ఇప్పుడు దాదాపు రూ.8.80 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభమవుతుంది. టాప్-స్పెక్ వేరియంట్ దాదాపు రూ.12.94 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది. బేస్ ాశ× పెట్రోల్ మోడల్ కోసం ఢిల్లీలో ఆన్-రోడ్ ధర, RTO, బీమాతో సహా దాదాపు రూ.10 లక్షల వరకు ఉంటుంది.

**3 / 5**

మార్కెట్లో పోటీదారులుగా ఉన్న కార్లు ఏవి?: ఇప్పుడు మారుతి ఎర్టిగా పవర్‌ట్రెయిన్ గురించి మాట్లాడుకుందాం. ఇది 1.5-లీటర్ స్మార్ట్ హైబ్రిడ్ పెట్రోల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది 101.65 bhp, 136.8 చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు పెట్రోల్, CN+ రెండింటిలోనూ లభిస్తుంది. CNG వేరియంట్ 88 PS పవర్, 121.5 చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. పెట్రోల్ మోడల్ 5-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. అయితే CNG వేరియంట్ 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో మాత్రమే వస్తుంది.

**4 / 5**

భారత మార్కెట్లో ఈ MPV 7-సీట్ల విభాగంలో టయోటా రుమియన్, రెనాల్ట్ ట్రైబర్ వంటి వాహనాలతో బలంగా పోటీపడుతుంది. కుటుంబ ప్రయాణికులకు, ఈ కారు స్టోరేజీ, మైలేజ్, ధర పరంగా మంచి ఎంపిక కావచ్చు.

## ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ విశ్వరూపం..

# సరికొత్త చరిత్ర సృష్టించిన రన్ మెషీన్..!



ఐపీఎల్ చరిత్రలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న కీలక పోరులో కోహ్లీ కేవలం పరుగుల వరద పారించడమే కాకుండా, ఎవరికీ సాధ్యం కాని రీతిలో పలు అద్భుతమైన రికార్డులను తన పేరిట లిఖించుకుని క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు.

ధర్మశాలలోని మైదానంలో పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ పరుగుల వేట చూస్తే అభిమానుల గుండెలు ఉప్పొంగాల్సిందే. ప్రతి ఏడాది సరికొత్త రికార్డులతో అలరించే కోహ్లీ, ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగి చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచిపోయే మైలురాళ్లను అందుకున్నాడు.

ఓపెనర్‌గా 5,500 పరుగులు.. ఒకే జట్టు తరపున సరికొత్త రికార్డు..!

ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ ఓపెనర్‌గా ఒకే ఫ్రాంచైజీ తరపున అత్యధిక పరుగులు చేసిన రికార్డుకు కేవలం 7 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభించిన కాసేపటికే ఆ మైలురాయిని దాటి, ఐపీఎల్ చరిత్రలోనే ఒకే జట్టుకు ఓపెనర్‌గా ఉంటూ 5,500 పరుగులు పూర్తి చేసిన మొట్టమొదటి బ్యాటర్‌గా కోహ్లీ అవతరించాడు. గతంలో శిఖర్ ధావన్, డేవిడ్ వార్నర్ వంటి ఆటగాళ్లు ఓపెనర్లుగా ఈ మార్కును దాటినప్పటికీ, వారు వేర్వేరు జట్ల తరపున ఆడారు. కానీ కోహ్లీ మొదటి నుంచి బెంగళూరు జట్టుకే ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం.

పంజాబ్‌పై పరుగుల ప్రవాహం..

కోహ్లీకి పంజాబ్ జట్టు అంటే ఎంత ఇష్టమో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే ప్రత్యర్థి జట్టుపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీ నిలిచాడు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్‌పై తను నెలకొల్పిన రికార్డును తనే అధిగమించి, ఇప్పుడు పంజాబ్ కింగ్స్‌పై ఏకంగా 1,175 పరుగులతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్ వంటి దిగ్గజాలు కూడా ఈ జాబితాలో కోహ్లీ కంటే వెనుకబడి ఉన్నారు.

9వ సారి 500 ప్లస్ పరుగులు..

కోహ్లీ స్థిరత్వానికి ఈ రికార్డే నిదర్శనం. ప్రస్తుత సీజన్‌లోనూ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, ఐపీఎల్ కెరీర్‌లో 9వ సారి ఒకే సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఘనతను సొంతం చేసుకున్నాడు. టోర్నీ చరిత్రలో మరే బ్యాటర్ కూడా ఇన్ని సీజన్లలో ఈ మార్కును అందుకోలేదు. వార్నర్, కేఎల్ రాహుల్ చెరో 7 సీజన్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా, వరుసగా నాలుగు సీజన్లలో (2023 నుండి 2026 వరకు) 500కు పైగా పరుగులు చేసి తన ఫామ్ ఎప్పటికీ తగ్గదని నిరూపించాడు.

మైదానంలో బౌలర్లకు చుక్కలు..

టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మొదట బౌలింగ్ ఎంచుకోగా, బెంగళూరుకు కోహ్లీ మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. యువ ఓపెనర్ జాకబ్ బెథెల్ త్వరగానే అవుట్ అయినప్పటికీ, కోహ్లీ మాత్రం పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. దేవదత్ పడిక్కల్ వేగంగా 45 పరుగులు చేసి నిష్క్రమించగా, కోహ్లీ మైదానం నలుమూలలా క్లాసిక్ షాట్లతో అలరిస్తూ క్రీజులో అజేయంగా నిలిచాడు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే 5 సార్లు యాభైకి పైగా పరుగులు చేసి జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. వయసు పెరుగుతున్నా పరుగుల ఆకలి మాత్రం తగ్గలేదని విరాట్ కోహ్లీ మరోసారి నిరూపించాడు. ఒకే ఇన్నింగ్స్‌లో ఇన్ని రికార్డులను బద్దలు కొట్టడం కేవలం కోహ్లీకి మాత్రమే సాధ్యమని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పండగ చేసుకుంటున్నారు. ఈ రన్ మెషీన్ ఫామ్ ఇలాగే కొనసాగితే బెంగళూరు జట్టుకు తిరుగుండదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## టీవీ9 కార్పొరేట్ బ్యాడ్మింటన్ సమరం..

# సీజన్ 2 ఛాంపియన్‌గా టాటా గ్రూప్..!



కార్పొరేట్ ప్రపంచంలో కేవలం వ్యాపార వ్యూహాలే కాదు, ఆటల్లోనూ తామే సాటి అని నిరూపించారు ఐటీ దిగ్గజాలు. హోరాహోరీగా సాగిన టీవీ9 నెట్‌వర్క్ కార్పొరేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సీజన్-2 గ్రాండ్ ఫినాలేలో అమెజాన్‌పై టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అద్భుత విజయాన్ని అందుకుంది. ఉత్కంఠభరిత పోరులో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది.

పుల్లేలా గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా జరిగిన ఈ టీమ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టింది. కోర్టు నంబర్ 6లో జరిగిన ఈ తుది పోరులో ఐటీ దిగ్గజాలు అమెజాన్, టీసీఎస్ జట్లు తలపడ్డాయి. మ్యాచ్ ఆరంభంలో అమెజాన్ క్రీడాకారులు పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచారు. తొలి రెండు గేముల్లో అమెజాన్ వరుసగా 21-11, 21-12 తేడాతో టీసీఎస్‌పై విరుచుకుపడి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. దాంతో అమెజాన్ సులువుగా టైటిల్ గెలుస్తుందని అంతా భావించారు. మూడో గేమ్‌లోనూ 21-17తో గెలిచి అమెజాన్ తన పట్టును మరింత బిగించింది.

మైండ్ బ్లోయింగ్ కంబ్యాక్.. టీసీఎస్ అద్భుత పోరాటం..!

వరుసగా మూడు గేములు ఓడిపోయి తీవ్ర ఒత్తిడిలో పడినప్పటికీ, టీసీఎస్ జట్టు ఏమాత్రం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ఇక్కడి నుంచే అసలైన అసమాన పోరాటం మొదలైంది. ఒక వైపు అమెజాన్ విజయం ఖాయమనుకున్న తరుణంలో, టీసీఎస్ ఆటగాళ్లు అద్భుత వ్యూహాలతో



కోర్టులోకి దిగారు. వరుసగా తదుపరి నాలుగు గేములను 21-17, 21-18, 21-15, 21-16 తో కైవసం చేసుకుని అమెజాన్ శిబిరాన్ని దిగ్భ్రాంతికి గురి చేశారు. మొత్తం 7 గేముల పాటు సాగిన ఈ సుదీర్ఘ మహాసంగ్రామంలో ఓటమి అంచుల్లోంచి లేచి వచ్చిన టీసీఎస్, అసాధారణమైన పోరాట పటిమతో విజేతగా నిలిచింది. పట్టుదల, జట్టులోని ఆటగాళ్ల మధ్య ఉన్న పరస్పర నమ్మకమే టీసీఎస్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టాయి.

రన్నరప్‌గా అమెజాన్.. మూడో స్థానంలో ఇన్ఫోసిస్..!

చివరి వరకు అత్యంత ప్రతిభను కనబరిచి, తృటిలో టైటిల్‌ను చేజార్చుకున్న అమెజాన్ జట్టు రన్నరప్ (ద్వితీయ స్థానం) ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఇక ఈ టోర్నమెంట్‌లో మరో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ మూడో స్థానాన్ని (ద్వితీయ రన్నరప్) కైవసం చేసుకుని అందరి ప్రశంసలు అందుకుంది. కాగా, మెన్స్ సింగిల్ విజేతగా గ్లాన్స్ (+శ్రీఖఅఎవ) కు చెందిన ప్రజ్వల్ నిలవగా, ఉమెన్స్ సింగిల్ విజేతగా ఎన్ రంగారావు అండ్ సన్స్ కు చెందిన చిన్మయి, మిక్స్డ్ డబుల్స్ విజేతగా ర్యాన్ సంస్థకు చెందిన రాహుల్, భార్గవి పతకాలు అందుకున్నారు. దీంతో మూడు రోజుల పాటు అట్టహాసంగా సాగిన టీవీ9 కార్పొరేట్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్ సీజన్ 2 నేటితో ముగిసింది. కార్పొరేట్ ఉద్యోగుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు టీవీ9 నెట్‌వర్క్ నిర్వహించిన ఈ బ్యాడ్మింటన్ లీగ్ సరికొత్త జోష్ నింపింది. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క జట్టు ప్రదర్శించిన క్రీడా స్ఫూర్తి, ఐక్యత ఈ పోటీలను చిరస్మరణీయంగా మార్చాయి. విజేతలుగా నిలిచిన టీసీఎస్ క్రీడాకారులకు, అద్భుత ప్రతిభ కనబరిచిన ఇతర జట్లకు నిర్వాహకులు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. వ్యాపార సామ్రాజ్యంలోనే కాకుండా క్రీడా మైదానంలోనూ పట్టుదల, సరైన వ్యూహం ఉంటే ఎంతటి కష్టమైన విజయాన్నైనా

# ధోనీ ఫ్యాన్స్ కు భారీ షాక్- ఆ మ్యాచ్ తో IPLకు రిటైర్మెంట్!

### ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్ కు సమయం వచ్చేసిందా?- ఆ మ్యాచ్ తోనే క్యాష్ రిచ్ లీగ్ కు గుడ్ బై చెప్పనున్నాడా?



చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో ఇప్పటికే 12 మ్యాచ్ లు ఆడేసింది. అయినా జట్టు సీనియర్ స్టార్ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ మాత్రం ఇప్పటిదాకా బరిలోకి దిగలేదు. ప్రాక్టీస్ సెషన్స్ లో కనిపించినా ధోనీ మాత్రం మ్యాచ్ లో ఆడలేదు. దీంతో అతడి కోసం అభిమానులు ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. అసలు ధోనీని ఈ సీజన్ లో చూస్తామా? అని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఓ వార్త బయటకు వచ్చింది. అయితే లీగ్ స్టేజ్ లో సీఎస్కేకు ఇంకా రెండు మ్యాచ్ లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ రెండింట్లో ఒకటి చెన్నై వేదికగా, మరొకటి ప్రత్యర్థి హోంగ్రౌండ్ లో ఆడనుంది. ఈనెల 18న సన్ రైజర్స్ హైదరాబాద్ తో సీఎస్కే సొంతగడ్డ చిదంబరం (చెపాక్) వేదికగా మ్యాచ్ ఆడనుంది. ప్రస్తుత సీజన్ లో చెన్నైకి హోం గ్రౌండ్ లో ఇదే ఆఖరి మ్యాచ్ కానుంది. అందుకే ఈ మ్యాచ్ లో ధోనీ బరిలోకి దిగుతాడని క్రీడా వర్గాల్లో ప్రచారం సాగుతోంది. సన్ రైజర్స్ తో మ్యాచ్ లో ఆడి, సొంత అభిమానుల ముందు ఐపీఎల్ కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని ప్రచారం జోరందుకుంది.

ఆ వ్యాఖ్యలతో చేకూరిన బలం!

ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్ వార్తలు వస్తున్న వేళ క్రికెట్ కామెంటేటర్ హర్షా భోగ్లే తాజా కామెంట్స్ ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఆయన తాజాగా 'ఈ సీజన్ లో చెన్నై ఒకే ఒక్క మ్యాచ్ చెపాక్ వేదికగా ఆడనుంది. అదీనూ సన్ రైజర్స్ జట్టుతో. ఈ మ్యాచ్ లో మనమంతా ఓ సర్ ప్రైజ్ చూసే అవకాశం ఉంది. అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసే నిర్ణయం వచ్చినా నేను ఆశ్చర్యపోను' అని వ్యాఖ్యానించాడు. దీంతో ఇది ధోనీ రిటైర్మెంట్ గురించే పరోక్షంగా మాట్లాడాడని నెటిజన్లు అనుకుంటున్నారు.

రేపే మ్యాచ్!

సోమవారం రోజే ఎస్ ఆర్ హెచ్- సీఎస్కే మ్యాచ్ ఉంది. ఈ మ్యాచ్ ఇరుజట్లకు కూడా అత్యంత కీలకం. ప్రస్తుతం 14 పాయింట్లతో ఆరెంజ్ ఆర్మీ మూడో స్థానంలో ఉండగా, చెన్నై 12 పాయింట్లతో ఆరో ప్లేస్ లో కొనసాగుతోంది. ప్లేఆఫ్స్ లో ముందడుగు వేయాలంటే రెండు జట్లకు ఇందులో గెలవడం కీలకం. ఓవైపు ప్లేఆఫ్స్ పోటీ రసవత్తరంగా ఉండగానే, తాజాగా ధోనీ రిటైర్మెంట్ అంటూ వస్తున్న వార్తలతో ఈ మ్యాచ్ కు మరింత ఆకర్షణ చేకూరింది. మరి రేపు ఏం జరగనుందో చూడాలి!

బరిలోకి దింపుతారా?

ఈ సీజన్ ప్రారంభం కాకముందే ధోనీకి గాయమైందని కొన్ని మ్యాచ్ లకు అందుబాటులో ఉండడని తొలుత మేనేజ్ మెంట్ చెప్పింది. ఆ తర్వాత ధోనీ క్రమంగా కోలుకుంటున్నప్పటికీ బరిలో దించడం లేదు. అయితే జట్టు కాంబినేషన్ ను మార్చకూడదని, తన వల్ల ఇంకో యువ ఆటగాడు జట్టులో స్థానంోల్పోవడం ఇష్టం లేకనే ధోనీ ఆడడం లేదని ఆ మధ్య వార్తలు వచ్చాయి. మరోవైపు, సీజన్ ఆరంభంలో తడబడ్డ సీఎస్కే సెకండ్ హాఫ్ లో పుంజుకొని ప్లేఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. మిగిలిన రెండు మ్యాచ్ ల్లోనూ నెగ్గితే ఆ జట్టుకు అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మేనేజ్ మెంట్ ధోనీని బరిలోకి దింపుతుందా? అనేది ఆసక్తిగా మారింది.

శకం ముగిసినట్లే!

ఒకవేళ సన్ రైజర్స్ మ్యాచ్ లో ధోనీ బరిలోకి దిగి సొంత అభిమానుల ముందు రిటైర్మెంట్ ఇచ్చేస్తే మాత్రం చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఒక శకం ముగిసినట్లే అవుతుంది. 2008 తొలి ఎడిషన్ నుంచి (2016, 2017 మినహా) ధోనీ సీఎస్కేతోనే ఉన్నాడు. సుదీర్ఘ కాలం జట్టును నడిపించి సక్సెస్ ఫుల్ ఫ్రాంచైజీగా నిలిపాడు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఐదుసార్లు జట్టును ఛాంపియన్ నిలిపిన ధోనీ సీఎస్కేలో ఒక వారసత్వం క్రియేట్ చేశాడు. అతడు తప్పుకున్న తర్వాత ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ఎవరికైనా సవాల్ తో కూడుకున్నదే. ధోనీ కెప్టెన్సీలో సీఎస్కే చివరిసారిగా 2023 ఎడిషన్ టైటిల్ నెగ్గింది.

# 60 మ్యాచ్ లు ముగిసినా తేలని ప్లే ఆఫ్స్ లెక్కలు- ఆఖరి వారంలో క్రేజీ క్లాషెస్

### 60 మ్యాచ్ లు ముగిసినా ప్లేఆఫ్స్ కు చేరుకోని జట్లు- చివరి వారంలో జరగబోయే 14 మ్యాచులే ప్లే ఆఫ్స్ డిసైడర్స్!- 16 పాయింట్లతో టాప్‌లో దూసుకుపోతున్న ఆర్‌సీబీ, గుజరాత్



ఐపీఎల్ అంటేనే విపరీతమైన పోటీ, అన్ లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్. ప్రస్తుత 19వ ఎడిషన్ కూడా అంతే హోరాహోరీగా, ఆసక్తిభరితంగా సాగుతోంది. టోర్నమెంట్ లో ఇప్పటిదాకా 60 మ్యాచ్ లు ముగిసినా ఏ జట్టు కూడా అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకోలేదంటేనే లీగ్ ఎంత హోరాహోరీగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ముంబయి, లఖ్ నవూ ఇప్పటికే నిష్క్రమించడంతో మిగిలిన 8 జట్లు కూడా పోటీలోనే ఉన్నాయి. దీంతో లీగ్ స్టేజ్ మ్యాచ్ లకు ఇదే చివరి వారం కావడంతో ఇకపై పోటీ మరింత రసవత్తరంగా ఉండడం ఖాయంగా కనిపిస్తుంది. లీగ్‌లో ఆఖరి వారంలో జరగబోయే ఆ 'క్రేజీ' మ్యాచ్ లు ఏయే జట్ల జాతకాలను మార్చబోతున్నాయి? అసలు ఈ ఉత్కంఠ భరిత క్లైమాక్స్ వెనుక ఉన్న పక్కా లెక్కలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ హవా- గుజరాత్ గట్టి పోటీ!

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 60 మ్యాచులు పూర్తయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రస్తుతం 12 మ్యాచుల్లో 8 విజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్ టాప్‌లో కొనసాగుతోంది. ఆర్‌సీబీ రన్ రేట్ కూడా ప్లస్ వన్‌లో ఉండటం ఆ టీమ్‌కు పెద్ద అడ్వాంటేజ్. మరోవైపు శుభ్ మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ 13 మ్యాచుల్లో 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లు ప్లే ఆఫ్స్‌కు చాలా దగ్గరగా ఉన్నప్పటికీ, టాప్ 2 స్థానాలను ఖరారు చేసుకోవాలి అంటే ఈ వారం జరగబోయే మ్యాచుల్లో కచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. పంజాబ్ కింగ్స్‌కు అగ్నిపరీక్ష- రేసులో సీఎస్‌కేఈ టోర్నమెంట్‌లో అందరినీ ఆశ్చర్యపరిచింది పంజాబ్ కింగ్స్. మొదటి 7 మ్యాచుల్లో 6 గెలిచి టేబుల్ టాప్‌లో నిలిచిన పంజాబ్, ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచులు ఓడిపోయి సెల్ఫ్ డిస్ట్రక్షన్ మోడ్‌లోకి వెళ్ళింది. ప్రస్తుతం 12 మ్యాచుల్లో 13 పాయింట్లతో పంజాబ్ నాలుగో స్థానంలో ఉంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ 12 మ్యాచుల్లో 12 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంటూ పంజాబ్‌కు గట్టి పోటీ ఇస్తోంది. సన్ రైజర్స్ హైదరాబాద్ 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా, రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఇంకా పోరాడుతోంది.

ఆదివారం అసలైన మజా

ఈరోజు ఆదివారం ఐపీఎల్‌లో రెండు కీలక మ్యాచులు జరగబోతున్నాయి. మధ్యాహ్నం 3:30 గంటలకు ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరగనుంది. వరుస ఓటములతో ఉన్న పంజాబ్‌కు ఈ మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. ఇక రాత్రి 7:30 గంటలకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. ఢిల్లీకి ఈ మ్యాచ్ అత్యంత ముఖ్యం. అటు రాజస్థాన్‌కు టాప్ 4లోకి దూసుకెళ్లేందుకు ఇదొక బెస్ట్ ఛాన్స్. ఈ రెండు మ్యాచుల ఫలితాలు పాయింట్ల పట్టికను మార్చేయనున్నాయి.

గెలిస్తేనే- ప్లే ఆఫ్స్ పక్కా లెక్క ఇదే

లీగ్ స్టేజ్ చివరి వారంలో జరగబోయే ప్రతి మ్యాచ్ ఒక్కో జట్టు పరిస్థితి ఏమిటనేది అర్థమవుతుంది. మే 18 సోమవారం నాడు చెన్నై చేపాక్ స్టేడియంలో సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య జరిగే పోరు అత్యంత కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ గెలిస్తే 16 పాయింట్లతో టాప్ 4 బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంటుంది, ఒకవేళ చెన్నై గెలిస్తే రేసు మరింత సంక్లిష్టంగా మారుతుంది. ఆ మరుసటి రోజు మే 19న జైపూర్‌లో రాజస్థాన్, లఖ్ నవూ తలపడనుండగా.. ఇప్పటికే 12 పాయింట్లతో ఉన్న ఆర్‌ఆర్‌కి ఇది మస్ట్ విన్ మ్యాచ్. మే 20న కోల్ కతాలో కేకేఆర్, ముంబయి తలపడనున్నాయి, ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలి అంటే కోల్ కతా ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవాల్సిందే. మే 21న అహ్మదాబాద్‌లో చెన్నైతో జరిగే మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ గెలిస్తే నేరుగా టాప్ 2లో నిలిచే అవకాశం ఉంటుంది. మరోవైపు మే 22న హైదరాబాద్‌లో ఎస్‌ఆర్‌హెచ్‌తో జరిగే పోరు డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరుకు అగ్నిపరీక్ష లాంటిది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ గెలిస్తే క్వాలిఫైయర్ 1కు లైన్ క్లియర్ అవుతుంది. ఇక మే 23న లఖ్ నవూలో ఎల్‌ఎస్‌జీతో జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ కచ్చితంగా గెలవాల్సి ఉంటుంది, లేదంటే టోర్నీ నుంచి ప్యాకప్ చెప్పాల్సి వస్తుంది. లీగ్ స్టేజ్ ఆఖరి రోజైన మే 24 ఆదివారం నాడు ముంబయిలో ఎమ్ఐ వర్సెస్ ఆర్‌ఆర్, కోల్ కతాలో కేకేఆర్ వర్సెస్ డీసీ మ్యాచులతో టాప్ 4లో నిలిచే ఆ నాలుగు జట్లు ఏవో పూర్తి క్లారిటీ వచ్చేస్తుంది.

# మైదానంలో అగ్గిరాజేసిన కోహ్లీ.. పంజాబ్ ఫీల్డర్‌కు చూపులతో స్ట్రాంగ్‌గా ఇచ్చిపడేశాడుగా..!



ధర్మశాల వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య జరుగుతున్న కీలక పోరులో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పరుగు తీసే క్రమంలో ప్రత్యర్థి ఆటగాడు హర్‌ప్రీత్ బ్రార్ తనను రనౌట్ చేస్తానంటూ కవ్వించినట్లు కళ్లెర్రజేయగా, కింగ్ కోహ్లీ సైతం అంతే దీటుగా ఇచ్చిన 'డెత్ స్టేర్' మైదానాన్ని ఒక్కసారిగా హీటెక్కించింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి.

వరుసగా 5 పరాజయాలతో ప్లే ఆఫ్స్ ఆశలను సంక్లిష్టం చేసుకున్న పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ గాయంతో దూరం కావడంతో జితేష్ శర్మ తాత్కాలిక సారథిగా బాధ్యతలు చేపట్టాడు. ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆర్సీబీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ జాకబ్ బెథెల్ కేవలం 11 పరుగులకే వెనుదిరిగాడు. ఆ దశలో క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కలిసి విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 76 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్ ఐదో బంతి వద్ద అసలు డ్రామా మొదలైంది. కోహ్లీ బంతిని పాయింట్ దిశగా నెట్టి సింగిల్ కోసం ప్రయత్నించాడు. కానీ అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న హర్‌ప్రీత్ బ్రార్ అత్యంత వేగంగా బంతిని అందుకున్నాడు. ముప్పును గమనించిన పడిక్కల్ పరుగును తిరస్కరించడంతో కోహ్లీ తిరిగి క్రీజులోకి రావాల్సి వచ్చింది. విరాట్ కోహ్లీ క్రీజు వెలుపల ఉండటం చూసిన బ్రార్, అతన్ని భయపెట్టేందుకు బంతిని వికెట్ల వైపు విసురుతున్నట్లు ఫేక్ త్రో చేశాడు.

తలపడదాం రా.. విరాట్ సవాల్..!

సాధారణంగానే మైదానంలో దూకుడుగా ఉండే విరాట్ కోహ్లీకి ఈ చర్య తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. తను క్రీజు బయట ఉన్నప్పటికీ ఏమాత్రం భయపడకుండా, వెనక్కి తగ్గకుండా అలాగే నిలబడిపోయాడు. హర్‌ప్రీత్ బ్రార్ కళ్లలోకి కళ్లు పెట్టి తీవ్రమైన చూపులతో చూస్తూ.. 'చేతనైతే వికెట్లను పడగొట్టు చూద్దాం' అన్నట్లుగా నిలబడ్డాడు. కోహ్లీ రుద్రరూపానికి ఒక్కసారిగా షాక్‌కు గురైన పంజాబ్ ఫీల్డర్ బ్రార్, బంతిని వికెట్లపైకి విసరాలనే ఆలోచనను విరమించుకుని సాదాసీదాగా తన సహచర ఆటగాడికి అందించాడు. ఈ ఇరు ఆటగాళ్ల మధ్య నడిచిన కొన్ని సెకన్ల మాటల్లేని యుద్ధం కెమెరాల్లో బందీ అయి, అభిమానుల్లో సరికొత్త జోష్ నింపింది.

మరోసారి చెలరేగిన రికార్డుల రారాజు..

ఈ ఘర్షణ తర్వాత కోహ్లీ మరింత కసితో ఆడాడు. పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 31 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లో కోహ్లీకి ఇది 67వ అర్ధశతకం కావడం విశేషం. అంతేకాకుండా ఈ ఇన్నింగ్స్ ద్వారా ఐపీఎల్ 2026 సీజన్‌లో 500 పరుగుల మైలురాయిని కూడా దాటేశాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు సాధించడం కోహ్లీకి ఇది తొమ్మిదోసారి. ఈ పరుగుల వరదతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుని, ఈ ఏడాది కూడా కప్పును కాపాడుకునే దిశగా పయనిస్తోంది.

రజత్ పాటిదార్ గాయంపై ఆందోళన..

ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉన్న తరుణంలో బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ గాయపడటం ఆ జట్టు అభిమానులను కాస్త ఆందోళనకు గురిచేస్తోంది. అతనికి ఎలాంటి గాయమైందనే విషయాన్ని యాజమాన్యం అధికారికంగా ప్రకటించలేదు. అయితే మే 22న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్ సమయానికి పాటిదార్ జట్టులోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తాత్కాలిక కెప్టెన్ జితేష్ శర్మ టాస్ సమయంలో వెల్లడించాడు. మైదానంలో ఎంతటి ఒత్తిడి ఎదురైనా, ప్రత్యర్థులు కయ్యానికి కాలు దువ్వినా తనదైన శైలిలో సమాధానం చెప్పడం కింగ్ కోహ్లీకి వెన్నతో పెట్టిన విద్య. హర్‌ప్రీత్ బ్రార్‌తో జరిగిన ఈ ముఖాముఖి పోరు బెంగళూరు-పంజాబ్ జట్ల మధ్య సాంప్రదాయ శతృత్వాన్ని మరింత ముదిరేలా చేసింది. ఈ అగ్నికి తోడు కోహ్లీ బ్యాటింగ్ విశ్వరూపం కూడా తోడవడంతో ఈ మ్యాచ్ లీగ్ దశలోనే అత్యంత ఉత్కంఠభరిత పోరుగా నిలిచిపోనుంది.

# హుషారు 2
## : కొత్త హీరోతో పెద్ద రిస్క్ వర్కౌట్ అవుతుందా?



టాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై ఊహించని విజయాన్ని అందుకున్న హుషారు మూవీ ఇప్పుడు సీక్వెల్‌తో మళ్లీ వార్తల్లోకి వచ్చింది. అప్పట్లో యూత్‌ఫుల్ కంటెంట్, ఫన్ ఎలిమెంట్స్‌తో బాక్సాఫీస్ వద్ద స్లీపర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమా, ఇప్పుడు రెండో భాగంతో మరోసారి అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తుందా అన్న చర్చ మొదలైంది. సాధారణంగా భారీ సినిమాలకే సీక్వెల్స్ రావడం చూస్తుంటాం. కానీ హుషారు లాంటి చిన్న సినిమా ఫ్రాంచైజ్‌గా మారడం టాలీవుడ్‌లో మారుతున్న ట్రెండ్‌ను ప్రతిబింబిస్తోంది. అయితే, మొదటి భాగం సక్సెస్‌ను సీక్వెల్ ఎంతవరకు క్యాష్ చేసుకుంటుందనేది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. హీరోగా అశోక్ గల్లా? ఇక ఈ సీక్వెల్ చుట్టూ ఎక్కువ చర్చకు దారితీసిన అంశం కాస్టింగ్. ఈ సీక్వెల్ కోసం ఒరిజినల్ కాస్ట్‌ను కొనసాగించకుండా, కొత్త హీరోగా అశోక్ గల్లాను తీసుకోవడం ఆసక్తికర నిర్ణయంగా మారింది. ఇప్పటికే హీరో మూవీతో డీసెంట్ డెబ్యూ అందుకున్న అశోక్ గల్లా, ఇంకా ఒక పెద్ద హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో హుషారు2 ఆయన కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఒకవైపు ఫ్రెష్ ఫేస్‌తో ఫ్రాంచైజ్‌కు కొత్త ఎనర్జీ వచ్చే అవకాశం ఉండగా, మరోవైపు ఒరిజినల్ ఫీల్ మిస్ అవుతుందా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ రిస్క్ ఫ్యాక్టర్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది.

# పెయింటింగ్ చీరలో కాయాదు స్టన్నింగ్ లుక్స్



అస్సాం నుంచి వచ్చి సౌత్ ఇండియాను తన నటనతో పలుకరిస్తున్న యంగ్ బ్యూటీ కాయాదు లోహర్, తాజాగా షేర్ చేసిన ఫోటోలతో నెట్టింట మంటలు పుట్టిస్తోంది. షీర్ ఆర్గాంజా చీరలో, చేతితో గీసిన బొటానికల్ ప్రింట్స్ మెరుస్తుంటే, ఒక అందమైన పెయింటింగ్ లా కనిపిస్తున్న కాయాదును చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఒకవైపు గ్లామర్ ఒలికిస్తూనే, మరోవైపు నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న కాయదు లేటెస్ట్ లుక్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం.. అస్సాం నుంచి వెండితెరకు.. కాయాదు జర్నీ: తేజ్‌పూర్ కు చెందిన కాయాదు లోహర్, తన అందం మరియు అభినయంతో చాలా తక్కువ సమయంలోనే మల్టీ లాంగ్వేజ్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకుంది. 2021లో 'ముగిల్ పేట' అనే కన్నడ సినిమాతో కెరీర్ ప్రారంభించిన ఈమె, ఆ తర్వాత మలయాళ, మరాఠీ చిత్రాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా 2025లో విడుదలైన 'డ్రాగన్' అనే తమిళ సినిమా ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమా తెచ్చిన గుర్తింపుతో ఇప్పుడు సౌత్ ఇండియన్ సినిమా అంతా కాయదు వైపు చూస్తోంది. ౹ూశ్రీంశీ =ముు - సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీడ ఏక్ దిన్ తో మ్యాజిక్ చేస్తుందా? హ్యాండ్ పెయింటెడ్ చీరలో అదిరిపోయే అందం: తాజాగా సోషల్ మీడియాలో కాయాదు పోస్ట్ చేసిన ఫోటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.రంగు రంగులతో కూడిన హ్యాండ్ పెయింటెడ్ బొటానికల్ ప్రింట్స్ ఉన్న షీర్ ఆర్గాంజా చీరలో ఆమె ఎంతో హుందాగా కనిపిస్తోంది. దీనికి కాంబినేషన్‌గా సేజ్ గ్రీన్ కలర్ బ్లౌజ్ ధరించి, మోడ్రన్ అండ్ ట్రెడిషనల్ లుక్‌ను పర్ఫెక్ట్‌గా మేనేజ్ చేసింది. మినిమల్ మేకప్ మరియు సింపుల్ హెయిర్ స్టైల్‌తో కాయాదు నిజంగా ఒక అందమైన కావ్యంలా ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. తెలుగు సినిమాల్లో బిజీ - వరుస ప్రాజెక్టులు: తెలుగు ప్రేక్షకులకు 'అల్లూరి' సినిమాతో పరిచయమైన కాయాదు, ఇప్పుడు టాలీవుడ్‌లో కూడా బిజీ అవుతోంది. ఇటీవల విశ్వక్ సేన్ సరసన 'ఫంకీ' అనే కామెడీ మూవీ తో మన ముందుకు వచ్చింది.ఇక నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది పారడైజ్' లో కూడా ఒక కీలక పాత్ర పోషిస్తోంది. అంతేకాకుండా, మలయాళంలో టొవినో థామస్ సరసన 'పల్లిచట్టంబి' వంటి క్రేజీ మూవీ లో నటిస్తుంది. నటనకు ఆస్కారమున్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడమే ఆమె సక్సెస్ సీక్రెట్ అనిపిస్తోంది. ఒకప్పుడు మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్న కాయదు, ఇప్పుడు సౌత్ ఇండియాలో బిజీయెస్ట్ నటిగా మారుతోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ప్రతి సినిమాలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటోంది. తాజాగా విడుదలైన ఫోటోలు చూస్తుంటే, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉందని అర్థమవుతోంది. మరిన్ని వైవిధ్యమైన సినిమాలతో కాయదు బాక్సాఫీస్ వద్ద కూడా తన సత్తా చాటాలని ఆశిద్దాం.

# స్మైల్ తోనే చంపేస్తున్న వాణీ కపూర్!





బాలీవుడ్ గ్లామర్ క్వీన్ వాణీ కపూర్ తన స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. జీరో సైజ్ ఫిగర్‌తో మతులు పోగొట్టే ఈ భామ, తాజాగా ఒక అవార్డు ఫంక్షన్‌లో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం గ్లామర్‌తోనే కాకుండా, తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతోంది. ముఖ్యంగా ఆమె చిరునవ్వుకు ఫిదా కాని అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ దాకా: వాణీ కపూర్ 'శుద్ధ్ దేశీ రోమాన్స్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ భామ సుపరిచితమే. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'ఆహా కళ్యాణం' సినిమాలో తన నటనతో, అందంతో సౌత్ ఆడియన్స్‌ను కట్టిపడేసింది. ఆ తర్వాత 'వార్', 'బెల్ బాటమ్' వంటి పెద్ద సినిమాల్లో గ్లామరస్ పాత్రలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఎప్పటికప్పుడు తన ఫ్యాషన్ సెన్స్‌ను మారుస్తూ కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది. అవార్డు విన్నర్.. నటనలోనూ మేటి: గ్లామర్ షో విషయంలో అస్సలు తగ్గని వాణి, నటనలోనూ తన సత్తా చాటుతోంది. తాజాగా జరిగిన 'పింక్ విల్లా స్క్రీన్ అండ్ స్టైల్ ఐకాన్స్ అవార్డ్స్'లో ఈమెకు 'బెస్ట్ యాక్టర్ ౹ు ఫిమేల్ (జూరీ)' అవార్డు దక్కింది. తన కో-స్టార్స్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ వాణి పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మతులు పోగొడుతున్న గ్లామర్ ఫోటోస్: తాజాగా ఒక ఈవెంట్ కోసం వాణి కపూర్ ముస్తాబైన ఫోటోలు చూస్తుంటే దేవకన్యలా ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె కిల్లింగ్ స్మైల్, పర్ఫెక్ట్ ఫిజిక్ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. "నేను ఇష్టపడే పనిని నేను చేస్తున్నాను.. అది నన్ను మళ్ళీ వెతుక్కుంటూ వచ్చింది" అంటూ ఆమె తన సంతోషాన్ని ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఆమె అందం, ఆ నవ్వు చూసి ఫ్యాన్స్ కంగ్రాట్స్ చెబుతూనే హార్ట్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను నింపేస్తున్నారు. ఇక మొత్తానికి వాణీ కపూర్ అటు గ్లామర్, ఇటు నటనను బ్యాలెన్స్ చేస్తూ కెరీర్‌లో కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. జీరో సైజ్ మెయింటైన్ చేస్తూ ఫిట్‌నెస్ ఫ్రీక్స్‌కు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఫ్లాట్ ఫామ్స్‌లో కూడా తన సత్తా చాటు తుండటంతో ఆమెకు మరిన్ని క్రేజీ ఆఫర్లు క్యూ కడుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని విభిన్నమైన పాత్రలతో ఆమె మనల్ని అలరించాలని, తన అంద చందాలతో వెండితెరపై మెర వాలని ఆశిద్దాం. వాణి కపూర్ అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, ప్రతిభకు కేరాఫ్ అడ్రస్ అని మరోసారి నిరూపించుకుంది.

# బిగ్ బడ్జెట్ సినిమాలపై మృణాల్ క్లారిటీ!

గ్లామర్ కంటే పర్ఫార్మెన్స్‌కే నా ఓటు అంటున్న మృణాల్ ఠాకూర్, తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతున్నాయి. తన కెరీర్ గ్రాఫ్‌ను మార్చేసిన సీత, యష్ణ వంటి పాత్రల తర్వాత.. ఆ స్థాయి లేని సినిమాలకు గుడ్ బై చెబుతున్నానని ఆమె గట్టిగా చెప్పారు. తాజాగా 'డెకాయిట్' మూవీతో ఆమె ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సెలెక్టివ్ జర్నీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు ఆ వివరాలు చూద్దాం.. బెంచ్‌మార్క్ పాత్రల కోసం వెయిటింగ్: మృణాల్ ఠాకూర్ తన కెరీర్‌లో 'సీతా మహాలక్ష్మి' (సీతారామం), 'యష్ణ' (హాయ్ నాన్న) వంటి పాత్రలను ఒక బెంచ్‌మార్క్‌గా భావిస్తున్నారు. ఆ స్థాయి నటనకు అవకాశం ఉన్న పాత్రలు దొరకడమే కష్టంగా మారిందని, అందుకే భారీ రెమ్యూనరేషన్ లేదా పెద్ద స్టార్స్ ఉన్నా సరే, తన పాత్రకు ప్రాధాన్యత లేకపోతే నిర్మొహమాటంగా 'నో' చెబుతున్నట్లు ఆమె వెల్లడించారు. కథలో లోతు లేని సాధారణ కమర్షియల్ రోల్స్ చేయడం కంటే, కాస్త ఆలస్యమైనా మంచి స్క్రిప్ట్ కోసమే ఎదురుచూస్తానని మృణాల్ స్పష్టం చేయడం విశేషం. డెకాయిట్‌తో అదిరిపోయే రీ-ఎంట్రీ: విమర్శలు ఎలా ఉన్నా, తాజాగా విడుదలైన 'డెకాయిట్' మూవీతో మృణాల్ మళ్ళీ ఫామ్ లోకి వచ్చారు. ఏప్రిల్ 10, 2026న విడుదలైన ఈ యాక్షన్ డ్రామాలో అడివి శేష్‌తో కలిసి ఆమె పోటీపడి నటించారు. ఇక ముఖ్యంగా ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో వచ్చే ట్విస్ట్ మరియు క్లైమాక్స్‌లో ఆమె పర్ఫార్మెన్స్ చూసి విమర్శకులు సైతం ఫిదా అయ్యారు. కొన్ని సీన్లలో అయితే హీరో శేష్‌ను కూడా మించిపోయేలా మృణాల్ తన నటనతో మాయ చేసిందని ఆడియన్స్ ప్రశంసిస్తున్నారు. పెద్ద ప్యాకేజీ ఆఫర్ కు నో : సీతారామం, హాయ్ నాన్న వంటి క్లాసిక్ హిట్లలో మృణాల్ చేసిన పాత్రలు ప్రేక్షకులలో ఒక బలమైన ముద్ర వేశాయి. అందుకే ఇప్పుడు తన దగ్గరకు వచ్చే ప్రాజెక్టుల విషయంలో ఆమె చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. కేవలం భారీ బడ్జెట్ ఉంది కదా అనో, లేదా పెద్ద హీరో సినిమా అనో కళ్ళు మూసుకుని సంతకం చేయకుండా.. కథలో లోతు, తన పాత్రకు ఉన్న ప్రాధాన్యతను మాత్రమే చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఒక నటిగా తన స్థాయిని పెంచుకోవడమే కాకుండా, ప్రేక్షకులకు ఎప్పుడూ నాణ్యమైన కంటెంట్‌నే అందించాలనే ఉద్దేశంతోనే, ఎంత పెద్ద ప్యాకేజీ ఆఫర్ చేసినా పాత్రలో దమ్ము లేకపోతే నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. మొత్తానికి మృణాల్ ఠాకూర్ ఇప్పుడు తన కెరీర్ లో మంచి హిట్ అందుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ఆస్కారమున్న 'డకాయిట్' వంటి కథలను ఎంచుకోవడం ఆమె పరిణతిని చూపిస్తోంది. చిన్నపాటి విమర్శలు ఉన్నప్పటికీ, తెలుగు ప్రేక్షకులు మాత్రం ఆమెను 'సీత' లాగానే ప్రేమిస్తున్నారు. మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో మృణాల్ తన బెంచ్‌మార్క్‌ను ఇంకా పెంచుకోవాలని కోరుకుందాం.



# 'రావ్ బహదూర్' కోసం సత్యదేవ్ ఇన్ని కష్టాలు పడ్డారా..నిజం గ్రేట్ బాస్!



టాలెంటెడ్ నటుడు సత్యదేవ్ తన కొత్త సినిమా 'రావు బహద్దూర్' కోసం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చకు దారితీశాయి. సినిమా ఇంకా రిలీజ్ కాకముందే దీన్ని బాహుబలి, అవతార్ వంటి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోల్చడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఓవర్ హైప్ వల్ల సినిమాలు దెబ్బతినే ప్రమాదం ఉన్నా, సత్యదేవ్ ఇంత కాన్ఫిడెంట్‌గా ఎందుకు ఉన్నారో? అసలు ఈ సినిమా వెనుక ఉన్న బలమైన అంశాలేంటో ఇప్పుడు చూద్దాం. అవతార్, బాహుబలితో పోలికా? సినిమా ప్రమోషన్లలో భాగంగా సత్యదేవ్ చేసిన స్పీచ్ అందరినీ షాక్‌కు గురిచేసింది. "బాహుబలి, అవతార్ వంటి సినిమాలు థియేటర్లలో మిమ్మల్ని ఎలాగైతే సీట్లకు అతుక్కుపోయేలా చేశాయో, రావు బహద్దూర్ కూడా అదే రేంజ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది" అని సత్యదేవ్ చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పారు.

సాధారణంగా ఇలాంటి పెద్ద సినిమాలతో పోల్చడం వల్ల అంచనాలు పెరిగి, ఒకవేళ సినిమా కొంచెం తేడా కొట్టినా భారీ డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉంది. అయితే ఇక సత్యదేవ్ మాటలు చూస్తుంటే, ఆయన ఈ ప్రాజెక్ట్ కోసం పడ్డ కష్టం మరియు అవుట్‌పుట్‌పై ఉన్న నమ్మకమే అలా మాట్లాడించిందని అర్థమవుతోంది సత్యదేవ్ విశ్వరూపం - మేకప్ కష్టాలు: ఈ సినిమా కోసం సత్యదేవ్ పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే సెట్స్‌కు వెళ్లి, దాదాపు 5 గంటల పాటు మేకప్ వేసుకునేవారట. సుమారు 80 రోజుల పాటు ఇదే షెడ్యూల్ కొనసాగిందంటే ఈ పాత్ర కోసం ఆయన ఎంతలా ప్రాణం పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 'నాట్ ఈవెన్ టీజర్'లో ఆయన లుక్ చూసినప్పుడే సత్యదేవ్ విశ్వరూపం ఎలా ఉండబోతోందో ఒక క్లారిటీ వచ్చింది. అందుకే తన కష్టానికి తగ్గ ఫలితం వస్తుందనే ధీమాతోనే ఆయన ఈ రేంజ్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నట్లు కనిపిస్తోంది. మహేష్ బాబు బ్రాండ్ - భారీ బడ్జెట్: సత్యదేవ్ కెరీర్‌లోనే రూ. 25 కోట్ల అత్యధిక బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. దీనికి తోడు సూపర్ స్టార్ మహేష్ బాబు నిర్మాణ సంస్థ జి.ఎమ్.బి ఎంటర్టైన్మెంట్ ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామిగా ఉండటం సినిమాకు పెద్ద ఎసెట్. నమ్రత గారు దాదాపు ఆరు గంటల పాటు కథ విని ఓకే చేశారంటే, సినిమాలో ఏదో బలమైన విషయం ఉండే ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక 1960-80ల నాటి నేపథ్యం, వారణాసి అందాలు ఈ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ గట్టిగా నమ్ముతున్నారు. అంచనాలను అందుకుంటారా?: అతివిశ్వాసం ఒక్కోసారి కొంపముం చుతుంది, కానీ సరైన కంటెంట్ ఉంటే అదే సినిమాను ఆకాశానికి తీసుకెళ్తుంది. సత్యదేవ్ మాటలు ఇప్పుడు సినిమాపై హైప్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. జూన్‌లో విడుదల కాబోతున్న ఈ చిత్రం నిజంగానే 'బాహుబలి' అంతటి ప్రభావాన్ని చూపిస్తుందా? లేదా కేవలం ప్రమోషన్ స్టంట్‌గానే మిగిలి పోతుందా? అన్నది చూడాలి. ఏదేమైనా, వెంకటేష్ మహా మార్క్ మేకింగ్‌పై ప్రేక్షకుల్లో ఉన్న నమ్మకం ఈ సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్. నిలకడగా రాణిస్తున్న సత్యదేవ్‌కు ఇది ఒక మైలురాయిగా నిలవాలని కోరుకుందాం.

PRINTER,PUBLISHER AND OWNED BY M. A. NAVEEN KUMAR AND PRINTED AT M /S VANAMALI PUBLICATIONS , # 2-5-B , Revenue Ward No :2, Rudrampeta, Anantapur Rural & Mandal, Anantapur -515004, <
Ananthapuramu District, Andhra Pradesh PUBLISHED AT D. No 1-493 B, INDIRA GANDHI NAGAR , Anantapur -515001, Ananthapuramu District, Andhra Pradesh Editor : M. A .NAVEEN KUMAR
Email : kumarmanaveen @gmail.com cell: 8919517176 D.NO. 20-6-83, ANJAIAH ROAD, OPP. SBI, LAWYER PET, ONGOLE, PRAKASAM, ANDHRA PRADESH - 523002